# సుగుణ

[పెద్దకథ]

శ్రీ బలివాడ కాంతారావు

(గతసంచిక తరువాయి)

౭

ఆదివారం. ముందురోజు ఆఫీసునుంచి కొన్ని ఫైళ్లు పని చేసుకోవా లని యింటికి తెచ్చినా నాకు చెయ్యాలని లేదు. సుగుణఆత్మకథ పూర్తిగా వినేద్దా మన్న వుబలాటంతో కాఫీ త్రాగాక 'కథ పూర్తికానీ' అన్నాను. సుగుణ వంటయింటివేపు చెయ్యి చూపించింది.

'నే నేమీ అనుకోను. యీ వేళకు భోజనం లేకపోతే చచ్చిపోం'

'మీ రెప్పుడూ యేదో అనుకుంటారనో, మెచ్చుకుంటారనో యే పనీ చెయ్యను. నాలో నాకు సంతృప్తి లేనిది ఎదుటివాళ్ల నెలా సంతృప్తిపరుస్తాను' అంటూ టేబిల్ మీది ఫైళ్లకట్ట చూపించి, అక్కడనుంచి వెళ్లిపోయింది. గత్యంతరం లేక ఫైళ్లకట్ట విప్పాను.

యీ కథేదో వినేద్దామని చకచకా పని చేశాను. నా పని పూర్తయేసరికి భోజనం తయారు. భోంచేశాక మాటాడే శక్తి లేకపోయింది గాని వినాలనే కుతూహలం పోలేదు. సుగుణ పడుకోవా లని ప్రయత్నిస్తోంది. అంచేత బలవంత పెట్టలేదు.

ఎండ బాగా చల్లారలేదు. తిరిగి వేగంగా వచ్చి వంటచెయ్యి చ్చని సుగుణను సముద్రపొడ్డుకు తీసుక పోయాను. చెదురుచెదురుగా మనుషు లున్నారు. గాలి హెచ్చుగా వీయటంవలన యిసుక యెగిరి మీద పడుతోంది. మా కథ నడవలేదు. నాలుగుముక్కలతోనే ఆగిపోతోంది. నేను వెనుకకు తిరిగి చూశాను. రోడ్డు ఆవల యిసుకదిబ్బమీద చిన్న సరుగుడుతోట కనిపించింది. ఆ చిన్న చెట్లు గాలికి ఆడుతున్నా యిసుక యెగరటం కనిపించలేదు. ఇద్దరం లేచి తోటకు వుత్తర వేపున యిసుకదిబ్బపై కూర్చున్నాం. దక్షిణదిశనుంచి వీచే గాలి తోటలో చొచ్చుకొని సంగీతస్వరంతో మమ్మల్ని తాకిపోతోంది. మా మనసులు వుల్లాసంతో నిండిపోవటంమూలాన కొంతసేపటివరకు ఆ వూగే చెట్ల వేపు చూశాం.

'ఎంతవరకు విన్నారు ?'

'నివ్వొకరోజున యిక్కడే కూర్చుంటే వాడు వచ్చి యేదో వాగాడన్నావ్'

'ఆయనవుద్దేశం కనుక్కోవా లనుకున్నా. ఆయనే అడక్కుండా తేలిపోయాడుగా—నే రమ్మన లేదు. నన్ను చూసి వచ్చాడు. కూర్చోమంటే కూర్చున్నాడు. చివరికి మాటలు కలిపి యిలా తేలిపోయాడు. అంత వేగంగా బయటపడతా డని నే ననుకోలేదు. మా తమ్ముడు కెరటాలదగ్గరకి పరుగెత్తుతుంటే వాడిని తీసుక వచ్చి దగ్గర కూర్చోబెట్టాక, ఏం చూసి నన్ను ప్రేమించా రన్నాను.

'నాలాంటివాడిని మీరు ప్రేమిస్తా రని అనుకోలేదు.'

'నేను ప్రేమించా నని మీరు ప్రేమించారన్న మాట. నేను ప్రేమించా నని మీ రెలా తెలుసు కున్నారు ?'

యీ ప్రశ్నకు ఆయన జవాబీయక నా వేపు చూసి మళ్లీ తలదించాడు.

'దయచేసి వెళ్లిపోండి. యీ మాటలు యిక్కడ ఆడితే వేరే అర్థం యివ్వవచ్చు. రేపు కాలేజీలో ఆడితే సంతోషంగా స్వీకరిస్తాను'

ఆయన లేవలేదు. కాని ముఖం ముడుచు కున్నాడు. నేను 'వస్తా' నని లేచివెళ్లిపోయా నింటికి.

ఆ రెండోరోజు కాలేజీలో బోటనీక్లాసులో ఒక్కత్తినే ముందుగా వెళ్లి కూర్చున్నా. నాతరువాత చంద్రశేఖర్రావు వచ్చి కూర్చున్నాడు. నేనే మాటలు మొదలుపెట్టాను. జవాబు లివ్వటానికి సిగ్గుపడు తున్నాడు. ఆయననోట్సు సరిగా లేవంటే నా పుస్తకం అందిస్తుండగా యీాయన దయచేశారు. నా వేపు యెర్రగాచూసి అక్కడ కూర్చున్నాడు. నేను న వ్వాపుకోలేకపోయాను.

'శేఖరం ! నేను ప్రేమించానని నన్ను ఆయన ప్రేమించారు. నే నెంత అదృష్టవంతురాల్ని' నేను నవ్వుతున్నానేగాని వాళ్ళిద్దరి సంగతి చెప్పలేను. శేఖరం అలా చూస్తావేం ? యీాయన చాలా ధీమాగా ఉన్నారే !

'శేఖరం ! నీకు తెలీదూ నిన్నుకూడా ప్రేమి స్తున్నా నని ?'

బూట్లచప్పుడు. అంతా ఒక్కసారి ముంచు కొచ్చారు. కొంతసేపటివరకు పుస్తకం విప్పి అక్షరాల వేపు చూడలేదు.

సుగుణ వూరుకుంది. నేను ఊఁకొట్టున్నా. ఆమె సరుగుడుచెట్లవేపు చూస్తూ 'మీ కింకా వినాలని ఉందా' అని ప్రశ్నించింది.

'హాఁ ! కానీ' అన్నాను.

'అసలు నాకు చెప్పా లని లేదు, ఇలాంటి విషయాలు చెప్పుకోవటంవలన యేం లాభం లేదు. ఉన్మాదులు మన మెదడికి పనికివచ్చే దేమీ యివ్వరు.

'నా దృష్టిలో వా డేమీ ఉన్మాది కాడు. నా వుద్దేశా లిలాంటి వని మొదట చెప్పకండా అలా సంచరిస్తే యెవరుమాత్రం పిచ్చియెక్కరు?'

'నావేపు మీ వుద్దేశాలు చెప్పే చూశారా ? మీ రంటే నే నెందు కలా అయ్యాను?'

'అనుభవంలేని కుర్రాడ్ని వున్మాది అనటం బాగా లేదు'

'అయితే వినండి. ఆరోజు సాయంత్రంకూడా వచ్చాడు. అట్టే మాటాడలేదు. రెండోరోజు వచ్చాడు. కూర్చో మన్నాను, కూర్చున్నాడు.

'మీకు పెళ్లయిందా ?' అని అడిగాను.

కాలే దన్నట్లు తల వూపాడు.

'అయితే పెళ్లి చేసుకోబోతున్నారా ?'

'ఏమో ?'

'మీగురించి మీరే మాట్లాడుకోలేనప్పుడు నా గురించి ఎలా మాట్లాడగలరు ?' అన్నాను.

దీనికి జబాబు లేదు.

'నా ప్రశ్నలకి జబా బివ్వరు. మీమీద మీకే విశ్వాసం లేదు. మీ బలహీనత నాదగ్గరే చూపిస్తు న్నారు. మీ రన్న దేమిటి ? నన్ను ప్రేమించా నన్నారు. పెళ్లాంగానా? అదేదో సరిగ్గా చెప్పండి'

దీనికి జబాబు లేదుగాని ఔ నన్నట్లు ఆ ముఖం చెప్పింది.

'నన్ను పెళ్లాం చేసుకోవా లని వుంది. సరే! నే నెలా ఆకర్షింపబడ్డాను?'

'నాకు ప్రేమంటే తెలియని పేదరికంలో మీరే భిక్షపెట్టా' రన్నాడు.

'భిక్ష యేరూపంలో పెట్టాను?'

'ఇంకేరూపం. ప్రేమరూపం. మీ పుస్తకం యిచ్చి. మీచే గౌరవింపబడ్డ మనిషి చింకిబట్టలుతో ఛీ—'

'అంచేతనా, ఆ గులాంబట్టలు కట్టారు. ఎక్కడ నుంచి తెచ్చారా యెరవు?'

'ఎరవు కాదు. స్వంతం. దగ్గర ఉన్న నాలుగు డబ్బులు ఖర్చు బెట్టి'

'సరి మిమ్మల్ని కాలేజీలో పుస్తకం యిచ్చి పెళ్లాంలా ప్రేమించలేదు. శేఖరాన్ని, మిగతావాళ్ళని యెలా ప్రేమించానో మిమ్మల్నీ అలాగే. అంత కంటే మీమీద కాస్త హెచ్చు జాలి చూపించాను. మీ రా బట్టలు కట్టాక అదికూడ అవసరం లేక పోయింది.'

కాస్సేపు నావేపు వికారంగా చూచాడు. ముఖం పక్కకు తిప్పాడు. నేను మళ్లీ అన్నాను. 'నా సంగతి నేను చెప్పుకోగలను. నేను కాలేజీలో యీ పరీక్షలతరవాత వుండను. ఎందుకంటే అది నాదిలా లేదు. తరవాత పెళ్లి చేసుకుంటాను. మా అమ్మ నన్నెలా పెంచిందో నేనుకూడ నా పిల్లలని అలా పెంచుతాను.'

ఆయన యిటూ అటూ చూశాడు. ఆ మార్పు నా కేమీ బాగులేదు.

'అయితే మీ వుద్దేశం?' అన్నాడు చటుక్కన.

'పెళ్లి చేసుకోవటం' అన్నాను.

'ఎవరిని?'

'నే నెంచుకున్న వాణ్ని.'

ఆయనగొంతుకదగ్గర గలగలలు నన్ను చిరాకెత్తించాయ్.

'అయితే నన్ను?'

'యీ ప్రశ్నతరవాతే మీకు యెంతమాత్రం పెళ్లాడా లని లేదు. నేనూ మామూలుమనిషినే. అయినా మీ రీనాడు అన్న మాటలు యెప్పుడూ వింటా నని అనుకోలేదు. యీ చివరి ప్రశ్న రావటానికి మీ కెంత కోపం వచ్చిందో. దీనినిబట్టి మీకు పెళ్లాడితే యెంత లాభమో తెలుసు. అయ్యే చెట్టుసంగతి ఆకులే చెప్పాయి. యిక దయచెయ్యండి.'

గభ్భున లేచిపోయి రొప్పుకుంటూ వెళ్లిపోయాడు. నా మన సెలా వుందేదో—మా చిన్నతమ్ముడు కళ్లల్లో యిసుక పోసుకొని యేడుస్తుంటే వాడిని ఓదార్చటంతో సరిపోయింది.

ఉత్తరం వ్రాశాడు. ఆ ఉత్తరం చదివి నే నేమీ కాలేదు. మళ్ళా యింకొక ఉత్తరం వచ్చింది. అదిమాత్రం మొదటిదానిలా చింపలేదు. రెండుసార్లు చదివి తిరిగి వ్రాసినవాడికే పంపేశాను. అప్పుడే ఆ మాసినగుడ్డలతో కనిపించాడన్నాను. మా అన్నయ్యలా వీడూ వున్మాదని వూరుకున్నాను.'

ఎందుకో నాకు ఆయనపై జాలివేయటంవలన 'సుగుణా' అన్నాను.

'వాడు ఉన్మాది కాడనేనా మీ అభిప్రాయం? మీ రొకప్పుడు అలాంటి ఉన్మాదులైతేగాని వాళ్లమీద సానుభూతి చూపింపలేరు!'

నే నేమీ మాటాడలేకపోయాను.

'మొదటి ఉత్తరం చూశాక ఒక కత్తి పట్టుకొని ఆయనదగ్గరకు వెళ్లి, నరుకుతానన్నావ్, కత్తి కోసం యెందుకు వెతుక్కుంటావ్! ఇదిగో నేనే తెచ్చాను - చంపు! అన్నాను.

నాకు తెలుసు ఉన్మాదులు ఎప్పుడూ ఏ కార్యాన్నీ సాధించలేరు. వుద్రేకమైన కబుర్లతో అమాయకుల్ని రెచ్చగొట్టి మంటల్లో మాడ్చేస్తారు. వారి ప్రాణం వాళ్లకు తీపే. నా ఆలోచన నాకే అసందర్భంగా తోచింది.

రెండో ఉత్తరం. ఇదీ ప్రేమ అనుకొని ప్రేమించిన మనిషి వ్రాసినట్టే వుంది. అది ప్రేమ కాదు, ఏం కాదు - మనసులో వున్న వికారాన్ని అలా వెళ్లగక్కటం. యీ మనసే, యీ శరీరమే నల్లగా మాడిన ముఖంతో యెదుటపడితే తుప్పన వూస్తారిలాంటి వాళ్లు. సరే! యిలాంటివాళ్ల విషయం మనం చెప్పుకోఅక్కర్లేదు. లేవండి పోదాం!' అని సుగుణే లేచిపోయింది. నేనూ లేచాను. మేం యింటికి చేరుకునేటప్పటికి వీధిదీపా లింకా వెలగలేదు.

## ౬

'పంచభూతాలే మన శరీరం. మనిషి చావగానే మళ్లీ వాటిని చేరుకుంటాడు' అన్నాను ఆమె ప్రశ్నకి జవాబుగా.

సుగుణ మాటాడలేదు. ఆకాశం వేపు ఆమెదృష్టి వుంది. నేనుకూడ మీదికి చూశాను. తారకలు కన్నుగీటుతున్నయ్. కుర్చీమీదినుంచి లేచింది సుగుణ. నే నలా వాలుకుర్చీమీద కూర్చునేవున్నాను.

'మనది తత్త్వజ్ఞుల దేశం. అయినా మనలా కష్టాలకు జడిసేవాళ్లు, చావుకు యేడ్చేవాళ్లు ప్రపంచంలో యింకెవ్వరూ లేరు' అంది యెదురుగా కనిపించే సత్యన్నారాయణస్వామికోవెలవేపు చూస్తూ.

నేను కుర్చీమీదినుంచి లేచాను. డాబాకు ఒక చివరను పిట్టగోడకు చేయి ఆన్చి నిలుచున్నాను. సుగుణ మెల్లగా మీదికి చూసుకుంటూ నాదగ్గరగా వస్తోంది. మనసులను హాయిగొల్పే గాలి వీస్తోంది.

'మన ప్రత్యేకత అదే' అన్నాను నేను.

'ఏది?' అంది సుగుణ నావేపు చూడకుండానే.

'మన యింటినిండా సంపదే. మనం అనుభవించం. పొరుగువాళ్లకిస్తాం. మనదేశం తత్త్వజ్ఞుల దేశమే. ఆ తత్త్వం పొరుగుదేశంలో పనికివచ్చింది.'

హాహా అంటూ ఒక్కసారిగా సుగుణ నవ్వింది.

'ఏం సుగుణా' అన్నాను దిగజారిన స్వరంతో.

'సరే! నిద్రపోతారా? లేక యింకా ఆ పాతగొప్పతో తెల్లవారేవరకూ గెంతులు వేస్తారా? కళ్లకు కనిపించింది చూడండి. మీకు పుణ్యం వుంటుంది.'

'సుగుణా! విడదీసి చెప్పు' అనటంకంటే యింకేమీ చేయలేకపోయాను.

'మనలో ప్రత్యేకత యేమీ లేదు గర్వించటానికి. బ్రతికున్నది మీరుగాని మీ తాతముత్తాతలు కారు. మీ ముత్తాతలు యింత గొప్ప పని చేశారని మీరు గొంతటంవలన మీ కేం గొప్ప లేదు. మరింత సిగ్గుచేటు. వారు చేసిన గొప్పని మీరు చెయ్యటానికి కృషి చెయ్యండి. అప్పుడే ఆ సాధకబాధకాలు కళ్లతో చూస్తారు.'

మారుమాటాడక అక్కడనుంచి నడచి పరుపు మీద వ్రాలిపోయి బలవంతంగా కళ్లు మూసుకున్నాను. కొంతసేపటికి నిద్రపోయాను.

సుగుణ నన్ను యెప్పుడూ కనకుతానై అలా నిశిరాత్రప్పుడు మేల్కొలపలేదు. నా కాశ్చర్యం వేసింది. దగ్గరగా వున్న ఆమెను ఎంతోసేపు చూడలేదు. గప్పున లేచాను.

మళ్ళీ యెందుకు ఆగిపోయానో చెప్పలేను. బహుశః ఆమెను అర్థంచేసుకోటానికి నా బుద్ధి చాలదని ఆగిపోయివుండవచ్చు. నా గొంతుకలో మాటలు దొర్లుకపోతున్నయ్‌గాని ఒకటే పైకి రాదు.

'నే నెందుకు చదువుకున్నా' నని ప్రశ్నించింది అలా తల దించుకొనే.

'నేను వూహించి తప్పు చెప్పేకంటే నివ్వే నిజం చెప్తే మంచిదేమో' అన్నాను.

'యీ రెండు రోజులలో అన్ని ప్రశ్న లెందుకు వేశారు?'

'నిన్ను చూసి నాకు తెలియకుండానే వేశాను.'

'నేను తిన్నగా నడవకుండా యింకొకర్ని తిన్నగా నడవమని చెప్పటంలో అర్థం లేదు. తెలివితక్కువదాన్ని' అంటూ లేచి ఆమె పరుపుమీదకుపోయి చారబడింది. నే నింకా అలా కూర్చున్నాను. ఆ ప్రవర్తన చూస్తుంటే యేం పాలుపోలేదు. అయినా నా మనసు ఆమెను సంబాలించాలని వుబలాటపడింది.

నేను లేచి ఆమెదగ్గరగా వెళ్లాను. 'సుగుణా' అన్నా నెంతో ఆప్యాయంగా. 'నీ వెవరినీ తిట్టలేదు. నీ మాటలు నేనుతప్ప యింకెవరు విన్నారు? నిజానికి నివ్వు మాటలతో నే నన్నాకర్షించావ్. నీలా మాట్లాడే

స్త్రీని యీసీమలో చూడలేను సుగుణా' అన్నాను.

'నిజం. నాలా వాగే మనిషిని చూడలేరు. నా యీ వాగుడు మీ మనసులోనైనా యెన్నాళ్ళుండి పోతుంది!'

ఆమె అర్ధనిమీలిత నేత్రాలవేపు అలా చూస్తూనే వున్నాను. 'నేను నాకోసమే చదువుకున్నా. నా భర్త నీతులు తెలిసి పాడయితే—నా పిల్లలు పాడవకుండా స్వతంత్రపౌరు లని చెప్పుకోతగ్గట్లుగా చెయ్యాలని చదువుకున్నా. ఇంతమాత్రం నే సాధించగలిగితే యీ దేశంలో ఆడజన్మ యెత్తినందుకు దేశసేవ చేశా నని మురిసిపోతాను'

ఊరుకోని నా చెవి నేనే మెలివేసుకోవటం కష్ట మనిపించింది. నేను ఆమెవూహలో పాడుమనిషిగా వుండటం నాకు సహించరానిదిగా తోచింది.

'సుగుణా' అన్నాను.

'ఏమండీ' అంది.

'నేను కళ్లతో చూడటం నేర్చుకుంటున్నాను. మంచిమనిషి నెలా గౌతానో చెప్పు'

యీ మాటలు ఆడాక నాలో నాకే ఆశ్చర్యం వేసింది. నేను పాడుమనిషిని కా నవబోయి యిలా అన్నాను. మాటలు గొంతువరకు వచ్చేసరికి మనసు మార్పు యిలా చేసింది.

నా సమాధానంతో ఆమె యెంతో మహదానందమూ తృప్తీ అనుభవిస్తోం దని గుర్తించాను.

గాలి వీస్తోంది. వెన్నెల కాస్తోంది. యివన్నీ నాకోసమే అని వీటిని స్తుతించక్ఖర్లేదు. వాటిపని అవి చేసుకపోతుంటే నాకాలం యిలా తగలెయ్యటంలో అర్థం లేదు. అయినా మానవస్వభావం బాగున్న వాళ్లనే పొగడుతాం. చెడ్డవాడిని చూసి అసహ్యించుకుంటాం. వా డెలా బాగుపడతా డని ఆలోచించం. డబ్బున్నవాడు దానం చెయ్యగానే వేనోళ్ల పొగడుతాం. ఆ డబ్బు యెందరు బీదవాళ్లని పిండితే వచ్చిందో—ఆ పేదవాళ్ల సంగతే మరచిపోతాం. నా సుగుణను నేను స్తుతించక్ఖర్లేదు. అయినా ఆమెను పొగడకుండా వుండలేకపోతున్నా, నేను మామూలు మనిషినికాబట్టి.

సుగుణ నన్ను పొగడుతున్నట్లే వుంటుంది; పొగడదు. తిట్టినట్లే వుంటుంది; తిట్టదు. ఆమె స్థాయిలో నే పడటానికి నాలో మొదటి లోటు ఆలోచించగా ఒక్కటే అని అనుకున్నాను. నాకు మెదడున్న దని నే ననుకోకపోవటమే.

ఆమె లేచి కుర్చీమీద కూర్చుంది. నే నామె పరుపుమీద వాలాను.

'మీకు నిద్దర రావటంలేదా?' అని ప్రశ్నించింది నా వేపు చూడకుండానే.

'లేదు' అన్నాను.

'సరే! చెప్పండి' అంది.

'ఏమి'టన్నాను.

'ఏం చెప్పదలచినారో అది'

'నే నేం చెప్పదలచుకోలేదు'

'సరే, నే నెప్పుడూ యీవేళలా వుండాలని లేదు. మీ విషయా లేమైనా చెప్పగలరా?'

నేను జబా బీయలేకపోయాను.

'మీ మాటలు నాకు వెర్రెత్తించవు. విరక్తి పుట్టించవు. మీ మంచిమనసుకు మరింత సంతోషిస్తాను'

యీ మాటలతో నాకు చెప్పా లనిపించింది. 'సుగుణా! నా సంగతి యెప్పుడూ చెప్పకూడ దనుకున్నాన. కాని యిప్పుడు చెప్తున్నాను. యెంచేతంటే నిన్ను యీ రెండురోజులలో అర్థంచేసుకోబోయి నేను మనిషి నని తెలుసుకున్నాను.'

నేను కాస్సేపు ఆగాను. నా జీవితం నా కళ్ల ఎదట వుంది.

'నాకు బాగా జ్ఞాపకం వుంది. వేసవి సెలవులకి రంగారాయపురం వెళ్లాను. ఆసంవత్సరమే కోటూ బూటూ వేసుకొని వెళ్లటం. సెకండుఫారందర్జా

అడంతాను. యింటికి వెళ్లాక ఎంతసేపో కూర్చోలేదు. వూరంతా తిరుగుతున్నాను. నా వెనకాల మా బాచిగాడు, గణపతి, రామయ్య, వీళ్లంతా కట్టు కథలతో, ఒక టేమిటి, బడిపంతులుదగ్గరనుంచి వాకిట పందులవరకూ వుదంతాలు చెప్తున్నారు.

'కిష్టిగా, నీకు తెలీదుగాని జీడితోటలో తాటి చెట్టుకి కాయ లున్నాయ్. కోయకుండా నీకోసమే వుంచాం. పదండీ పదండీ అండీ' అని ఒక్కటే పరుగు.

బాచిగాడు చెట్టెక్కి మోపుమీద కూర్చొని గెలలు నరుకుతున్నాడు. నన్ను కొంచెందూరంలో కూర్చోబెట్టి చెదిరిన కాయలు కూడబెట్టున్నారు మిగతావాళ్లు. నేను చెట్టువేపు చూస్తున్నాను.

వీళ్లంతా ఒక్కసారి 'గుండూభాయ్, గుండూ భాయ్' అని గెంతులేస్తున్నారు. చప్పట్లు కొట్తున్నారు. చెట్టుమీద నున్న బాచిగాడుకూడాను. చుట్టూ చూశాను. నా వెనకాలే వున్న మా మామిడి తోటనుంచి సావిత్రి పరుగెత్తి నావేపే రావటం చూశాను. సావిత్రివెనకాలే మామిడికొమ్మ పట్టుకొని గబగబ ఒక ఆడమనిషి కోపంగా నడవటం చూశాను. సావిత్రి గప్పున వచ్చి నా చేతిలో మామిడికాయ పెట్టి నాదగ్గర కూర్చుండిపోయింది. వీళ్లింకా గుండూ భాయ్ అనటం మానలేదు. ఆ గుండు చూస్తుంటే నాకూ అనబుద్ధివేసింది. 'ఏం సావిత్రీ' అనే బదులు 'ఏం గుండూభాయ్' అన్నాను. అలసిపోతున్న ఏడేళ్ల సావిత్రికళ్లల్లో నీరు తిరగటం చూశాను.

తోటకాపుపెళ్లాం సావిత్రిని కొట్టా లన్నంత కోపంతో వచ్చింది. కాని నన్ను చూడగానే 'అబ్బాయిగోరు యెప్పుడొచ్చా' రంది. 'యీవేళే' అన్నాను. 'సూడు బాబూ, యీ గుంటపాప రాలిన మామిడికాయ దొంగలాడి, నాదీ అంటాది.'

'తప్పు కాదా' అన్నట్లు నేను సావిత్రివేపు చూశాను.

'అబద్ధం ఆడుతుంది కిష్టీ. మా అమ్మ యిస్తే నీ కీయడానికి పరుగెత్తుకొని వస్తే'

'ఛీ! కా యెవరు తింటారు ?' అని విసిరేశా నా కాయని. మా గణపతిగాడు తీసుకొని పిల్లికోరుకు కొరికి అక్కడున్నవాళ్లకి పంచిపెట్టున్నాడు. సావిత్రి వెక్కివెక్కి ఏడుస్తోంది.

బాచిగాడు చెట్టు దిగాడు. కొమ్మలతాలుకు కరుకులు రాపాడాయేమో శరీరంమీద అక్కడక్కడ రక్తం చిమ్ముతోంది. సావిత్రికూడ చూసింది. రక్తం చిమ్మినదగ్గర వుమ్మంటిస్తూనే 'గుండూభాయ్ గుండూ భాయ్' అని వెక్కిరిస్తున్నాడు.

సావిత్రి ఆ ధూళిలోనే కాళ్లూ చేతులు కొట్టుకుంటూ యేడుస్తోంది. నేను తాటిముంజలు తింటూ, వూరుకో గుండూభాయ్ అనైనా అనలేదు.

'చెప్ప నేమిటి ?' అంటూ బాచిగాడివేపు యెర్రగా చూసి హఠాత్తుగా లేచి పరుగెత్తింది. నాకు భయం వేసింది. యీ రక్తంగురించి మా నాన్నతో చెప్పిందంటే యిదంతా నేను చెయ్యించానని నాన్న నన్ను కొట్తాను. సావిత్రిని వెంబడించాను. ఇన్నాళ్లలా చిన్న జట వుంటే గప్పున పట్టుకొనేవాణ్ని.

'కిష్టీ ! కొట్టకు. చెప్పను, చెప్పను' అంటూ గడ్డి నేలమీద కూర్చుండిపోయి రెండు చేతులూ నెత్తిన పెట్టుకొని భయంతో వణికిపోతోంది. నిజంగా అప్పుడు నాకు కనికరం వేసింది. ఆ గుండుమీద చెయ్యి వేశాను. గట్టిగా యేడుస్తోంది. లేవదీసి 'యెందు కేడుస్తున్నా' వన్నాను.

'పేలు పట్టాయని నాన్న గుండు చెయ్యించా' రని ఏడుస్తూ చెప్పగానే అదేమిటో ఆ వయసులో మరీ జాలివేసింది. ఇలాగైనా బుజ్జగిద్దామని కావాలను 'యిం కెప్పుడూ కాయ విసరనులే' అన్నాను.

'అమ్మ మళ్లీ యిస్తుందా ?' కళ్లింతవి చేసుకొని, యివ్వ దన్నట్లుగా నావేపు చూసింది.

'గుండూభాయి వూరూరు' అంటూ చేతిలో తాటికాయ పట్టుకొనివచ్చిన మా బాచిగాడు వెక్కిరించటం మొదలుపెట్టాడు. నాకు కోపంవచ్చి బాచిగాడికి ఒక్క లెంపకాయ కొట్టి వెళ్లిపోయాను.

సావిత్రి ఎటు వెళ్లిందో నేను చూడలేదు.

'సుగుణా ! వింటున్నావా ?' అని ప్రశ్నించాను.

'ఊఁ, చెప్పండి' అంది. సుగుణ యే ప్రశ్నలూ వేయకపోవటంవల్ల నా మనసు ఒకే త్రోవలో పోతోంది.

'చిన్ననాటి చిలిపిచేష్ట లెన్నో వున్నయ్. తెలియక చేసిన తప్పులు చెప్పుకోదగ్గవి కావు కూడాను. నేనిది ఎందుకు చెప్పానంటే—ఆవేళ ఆ చిన్న సంఘటన మా యిద్దరి జీవితాలనూ చిత్రించింది !

౨

నేను స్కూలుఫైనలు చదువుతున్న రోజులవి. చదువుమీద నాకు శ్రద్ధ కొంచెమైనా లేదు. దిగువ క్లాసుల్లో రెండేసేళ్లచొప్పున కూర్చున్నాను. క్లాసులో పైకి కనపడని పెంకితనం చేసేవాడిని. బడికి సాధారణంగా వెళ్లటంమాత్రం మానలేదు. ఎంచేతంటే క్లాసులో వున్న అమ్మాయిలమీద దృష్టి పోయేది.

ఇంటినుంచి కావలసిన డబ్బు. బట్టలు రోజుకొక జత మార్చేవాడిని. వాసననూనెలూ, సెంట్లూ—ఏమిటో అదొక గర్వం అప్పుడు—ఇప్పుడదొక వెర్రిలా కనిపిస్తోంది.

ఏదైనా శృంగారమైన పుస్తకం దొరికిందంటే బడికి వెళ్లటం మాని చదువుకొనకూర్చొనేవాడ్ని. ఏ తారాశశాంకంలోని పద్యాలో కంఠస్థంచేసి పాడుకోవటం అదొక సరదా. గదినిండా సినీమా తారలు—ఆ బొమ్మలకేసి దీక్షగా గంటలకొద్దీ చూస్తూ కూర్చోవటం.

ఆ అమ్మాయి కిటికీనుంచి చూసి కిలకిల నవ్వింది. వాళ్లిద్దరూ వెన్నెల్లో హాయిగా మనిషీమనిషీ రాపాడుకొని విహరించారు. ఉద్యానవనంలో మల్లెపొద చాటున ముద్దులుపెట్టుకున్నారు. మిసమిసలాడే ముగ్ధ పమిట జారింది—అబ్బా !—యీ కథలు, యీ నవలలు, యీ సినీమాలు నా పద్ధాలుగేళ్లదగ్గరనుంచీ నా మెదడుకి యెక్కించిన విషయాలు.

నా పద్ధెనిమిదోయేటనుంచీ నాలో నేనే యేదో పిచ్చిగా మాట్లాడుకొనేవాడిని. ఏ బొమ్మనో పట్టుకొని నవ్వుకుంటూ కళ్లదగ్గర పెట్టుకొనేవాడ్ని. మంచిరాత్రప్పుడు కిటికీగుండా వెన్నెల నా ముఖం మీద పడితే చాలు అలా యేడ్చుకుంటేవాడిని. నా తలలో యెప్పుడూ యే సినీమాలోని ఘట్టమో, యే నవలలోని ఆడదో తిరిగి నన్ను వెర్రెత్తించేది.

ఒకనాడు రెండు కళ్లు నా కళ్లల్లోనికి యెంతో తియ్యగా చూశా యనుకున్నాను. ఆ వెంటనే వెళ్లాను. ఒక మేడలోనికి పోయి తలుపు చారవేసింది. అలా అక్కడే ఒక ఎలెక్ట్రిక్ స్తంభానికి చారబడి చాలా సేపు నిలుచుండిపోయాను.. ఆ మరుచటిరోజు స్కూలుకు పోకుండా ఆ రోడ్డువెంబడి ఎన్నోసార్లు తిరగా నా కళ్లకోసం. కాని కనిపించందే...

ఇలాంటి వెన్నో వెర్రిపనులు చేశాను. అలాంటివి జ్ఞాపకానికివస్తే సిగ్గుతో కూడుకపోతాను.

శెలవులిచ్చారు. రంగారాయపురంఅంటే నాకు రెండేళ్లనుంచీ అసహ్యంవేస్తోంది. యీయేడు మరీని. చిన్నక్లాసుల్లో వున్నప్పుడు ఆ వూ రెప్పుడు వెళ్తాను, అమ్మనీ, నాన్ననీ, సావిత్రినీ వాళ్లందరినీ యెప్పుడు చూస్తా ననిపించేది. ఆ తోటల్లో హాయిగా ఆడుకోవచ్చు. మా తెల్లావుపాలు తాగొచ్చు. అమ్మ దగ్గర పడుకోవచ్చు...

ఇవన్నీ లే విప్పుడు. శృంగారం, సౌందర్యం మీదే నా దృష్టి.

'యీ వుత్తరం చూడగానే రాకపోతే నేనే వస్తా'నని నాన్న వ్రాయటంచేత రంగారాయపురం వెళ్లక విధిలేకపోయింది.

ఇదివరకులా నా మనసు సావిత్రికోసం ఆందోళనపడలేదు. కాని మనసులో ఒకసారి చూడాలనే కోరిక లేకపోలేదు. బాచిగాడూ, గణపతీ పెళ్లిళ్లు చేసుకొని పెళ్లాలతో కాపరంచేస్తున్నారు. వాళ్లు వచ్చి పలకరిస్తే జబాబు చెప్పటానికి చిన్నతన మనిపించింది.

సావిత్రితల్లి, సావిత్రితండ్రి మేష్టారు వచ్చి పలకరించారు. ఐదో క్లాసువరకూ ఆయనదగ్గర చదువుకున్న రోజులు—ఎన్నిసార్లు కోదండం యెక్కానుః అవేవీ నాకు జ్ఞాపకం లేవు. చాలా ప్రాధేయపడుతూ మాట్లాడాడు. నా మాటలే కరువయ్యాయ్.

ఇంట్లో వున్నానేగాని నా మనసు పట్నంలో పార్కుల్లోను—వేసంకాలంగా! చాలామంది ఆడవాళ్లు వస్తారని—క్లాసులోని అమ్మాయిలమీదా! ఏదో వంక పెట్టి తిరిగి వెళిపోదామని వుబలాటపడ్డాను.

సాయంత్రం ఒక్కడినే అలా చెరువుగట్టువేపు వెళ్లాను. వేసంకాలం అయినా పెద్ద చెరువు కాబట్టి వున్న నీరు తేటగానే వుంది. మా పెద్దరైతుపెళ్లాం పలకరించింది. కాస్సేపు మాటాడి ముందుకు సాగాను. సావిత్రి కనిపించింది. నాకు తెలియకుండానే ఆగిపోయాను. యీ కొద్దినెలలలో సావిత్రిలో వచ్చిన మార్పు—అంత అందంగా ఉంటుందని అనుకోలేదు. నా తలలో గుండూభాయి, చిన్న పరిఖిణీతో వున్న సావిత్రే వుండేది. ఆ చీరకట్టు, ఆ నడక—పాదాలకున్న పట్టీలు—అలా ఎంతసేపైనా చూడాలనిపించింది. నా వేపు ఒకసారి చూసి గబగబ నడవటం మొదలుపెట్టింది. పాపం! బిందెలో నీరు ఒలికి ఆమె చీర తడుపుతోంది. సావిత్రి కనుపించేవరకూ చూస్తూనే వున్నాను.

ఆ నిముషం దగ్గరనుంచి నాకు ఆవూర్లో వుండాలనిపిస్తోంది. సావిత్రికళ్లల్లో యిదివరకు చూసిన కళ్లల్లో తళుకుకంటే హెచ్చు కనిపించింది. సావిత్రి నడకలో సొగసుంది.

చెరువురెండోవేపు వెళ్లి ఒక మడిగట్టుమీద కూర్చున్నాను. బీటలుదేరిన భూమివేపు చూస్తున్నాగాని నా మనసు సావిత్రిమీదే వుంది. అంతఅందంగా వున్న సావిత్రి, నాదెందుకు కాకూడదనిపించింది. ఇదివరకటిలా యిప్పుడు నా సావిత్రి అనుకోడానికి సాహసించలేకపోయాను.

నేను చీకటిపడకుండానే యింటికి వెళ్లేసరికి సావిత్రి మా యింట్లోనే వుంది. నాగురించే మాట్లాడుకోవడం విని విస్తుపోయాను. సాహసం చేసుకొని నక్కివున్నవాడిని గప్పున పెరటికి వెళ్లి 'ఏం సావిత్రీ' అని పలకరించాను. సావిత్రికి యీ బ్రహ్మాండమైన సిగ్గు యెక్కడనుంచి వచ్చిందో-గబగబ వెళిపోతోంది, తల వంచుకొని. అమ్మ వంటయింటినుంచే అంది-'అదేమిటే సావిత్రీ! కిష్టి కిష్టి అని పలవరించేదానివి. వాడొస్తే వెళిపోతున్నావేం?' వినిపించుకోనట్టే వెళిపోతుంటే గబగబ వెళ్లి అలవాటుకొద్దీ జడ పట్టుకోబోయి చెయ్యి పట్టుకున్నాను.

'ఉండు కిష్టీ' అంటూ చెయ్యి విదిలించుకొని వెళిపోయింది.

అమ్మ వచ్చి నాదగ్గరగా నిలబడినట్టు కొంతసేపటికి గాని తెలుసుకోలేకపోయాను.

'పెళ్లి అని అనుకున్నాక మరీ సిగ్గు హెచ్చిపోయిందిరా బాబూ' అంది.

'ఎవరికమ్మా? సావిత్రికే?' అన్నాను నా చెవులనే నమ్మలేక.

'అవునురా, సంబంధం స్థిరమైంది. డబ్బు సర్దుకోలేక, మేష్టరుగారు వచ్చేయేటికంటున్నారు.'

'మంచిదే' అని అక్కడ వుండలేదు.

ఆ మరుక్షణంనుంచి నాకా వూర్లో వుండాలని లేదు. ఆ మరుచటిరోజు ప్రొద్దున్న చెరువుగట్టుమీద చేతిలో టూత్ బ్రష్‌తో కూర్చున్నాను. సావిత్రి ఒక్కరితే రాలేదు. ఇంకొకావిడతో కలిసివచ్చింది. సావిత్రి వేపు నాకు చూడాలని లేదు. యీ కొత్తమనిషి యెవరో చాలా బాగుందనిపించింది. ఆమెవేపు చూస్తున్నాను. ఆమెమాత్రం నా వేపు అసలే చూడలేదు. నేనేదో గాబరాపడిపోతున్నాను.

గణపతిగాడు నాదగ్గరగా కూర్చున్నాడు పళ్లుదోముపుల్ల పట్టుకొని. 'కిష్టీ' అని పిలవగానే నేను తడబడి వాడికేసి చూశాను. 'అదిగోరా నా పెళ్లాం' అని నవ్వుతూ, నీటిలో బిందె ముంచుతున్న ఆవిడవేపు చూపించాడు. ఇంతసేపూ నేను బాధపడింది యీ

మంత్రాలు చదువుకున్న గణపతిగాడి పెళ్లాంకోసమా !

'వస్తానురా' అని ముఖం కడుక్కొని వచ్చేశాను. పొట్టి జుత్తు, వీభూది, చిన్న బొజ్జ—అలాంటి గణపతిగాడే అంత అందమైన పెళ్లాన్ని కట్టుకున్నప్పుడు నేను ఎంతో అందమైనదాన్ని పెళ్లాడాలని భీష్మించుకున్నాను.

ఇంటికి వచ్చాను. పట్నం వెళ్లిపోతానని అమ్మతో చెప్పాను. అమ్మ వుండమని, బ్రతిమాలుతుంటే నా పట్టుదల మరీ హెచ్చిపోయింది. నాన్న తోడల్లుడికూతురు పెళ్లికి వెళ్లారు. నేను రాబట్టి అమ్మ వెళ్లలేదు. నాన్న మూడురోజులవరకూ రారు. నాన్న వచ్చేవరకైనా వుండమని అమ్మ బ్రతిమాలింది. ససేమిరా ఉండనని పంతంపట్టాను. అమ్మకళ్లల్లో నీరు తిరిగినా నా భ్రమ నన్ను పట్టు విడవనిచ్చింది కాదు.

నే నింకా భోంచెయ్యలేదు. అమ్మ యెక్కడికో వెళ్ళింది. వాలు కుర్చీ పెరటివాకిట్లో వెన్నెల్లో వేసుకొని కూర్చున్నాను. ఇంకా గణపతి పెళ్లామే నా కళ్లల్లో తిరుగుతోంది. ఇదంతా పల్లెటూరి అందం. పట్నంనాజూకుయెదట యీ అందం దేనికి ? ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే 'కిష్టీ' అన్న కీచుగొంతుక వినిపించింది. చుట్టూ చూశాను. సావిత్రి !

సావిత్రిచూపువల్ల నే నేమీ కాలేదు; యేమీ గ్రహించలేదు.

'కిష్టీ, యిది నీకు న్యాయంగా వుందా ?'

'ఏం టా యిది ?'

జబాబు లేకపోవటంతో వెనక్కి చూశాను. సావిత్రి తల దించుకొనే వుంది. యీసారి ఆమెవేపు చూడా లనిపిస్తోంది.

'కిష్టీ' అని ఒక్కసారి యేడుస్తూ నా పాదాల దగ్గర కూర్చుండిపోయింది.

'పిచ్చిదానా ! యేడుస్తా వెందుకు ?' ఓదార్చుదా మని ఆమెతలమీద చెయ్యి వేశాను. సావిత్రిని తాకగానే నా నరాలన్నీ ఝలాలుతప్పాయ్.

'కిష్టీ, రేపు వెళ్ళిపోతావా ?'

'హాఁ'

'నిజంగా వెళిపోతావా కిష్టీ ?' నీరు నిండిన కళ్లతో నా ముఖంవేపు చూస్తూ లోతుస్వరంతో అంది. నా కళ్లిందుకో మండాయ్. కాస్త తొట్రుపాటుతో 'అయితే వెళ్లనులే సావిత్రీ' అన్నాను.

నా పాదాలదగ్గరనుంచి చటుక్కన లేచిపోయి 'వస్తాను కిష్టీ ! అమ్మకోసం నే వచ్చినందుకు వుండటానికి ఒప్పుకున్నావ్. అమ్మ ని వ్వెళిపోతా వని మాయింటిదగ్గర చెప్తూ యేడుస్తుంటే నీదగ్గరకు వచ్చి నే నేడ్చాను. నా యేడుపుతోనే నీ మనసు కరిగింది గాని కని పెంచిన అమ్మయేడుపు కనపడలేదేం ? ఆ కోట్లూ బూట్లూ అవతల పారేయ్ కిష్టీ ! సిగ్గైనా వస్తుంది' అంటూ గబగబ వెళిపోతోంది. యీ మాటలు ఆ పల్లెటూరిపిల్ల నోటివెంబడి వచ్చా యని నమ్మలేకపోయాను.

ఆమె వెళిపోవటం నా కిష్టంలేదు. గబగబ లేచి ఆమెవెనకాల వెళ్లి వసారాలో ఆమెచెయ్యి పట్టుకున్నాను. ఆగి తిరిగి నావేపు చూసింది. నా జీవితం అంతా వెన్నె లనిపించింది. ఆగలేక సావిత్రిని గట్టిగా గుండె కదుముకొని 'నా సా...' అన్నాను.

ఎంతసేపో అలా లేను. సావిత్రి ఏడుస్తోంది. నాకు జాలివేసింది. నేను కొట్టానేమో నని ఆవేళ లొంగిపోయిన సావిత్రి యీనాడు నా వాంఛకి లొంగిపోయింది. సావిత్రిని అలా పట్టుకొనే 'ఏడుస్తున్నా వేం సావిత్రీ' అన్నాను.

'పెళ్లి...'అంది. ఆనాడు ఆమెబాగుకోసమే గుండు చెయ్యించారు. యీనాడు పెళ్ళి ఆమెబాగుకోసమే చేస్తున్నారు. ఆమెకు యిష్టం లేకపోబట్టి యేడుస్తుం దని అనుకున్నాను.

అడుగుల చప్పు డవబట్టి అమ్మ వస్తోందని వూహించాను. నేను గాబరాపడుతోంటే సావిత్రి

ముందుకు నడచి 'కిష్టి వుండటానికి ఒప్పుకున్నా డత్తయ్యా' అంది. 'నిజంగానే' అని అమ్మ సావిత్రిని వీధివాకిలిలోనే కౌగిలించుకోవటం చూచి పెరటికి వెళ్లి కుర్చీమీద కూర్చున్నాను.

౮

ఆ మరునాడు వుదయం సావిత్రియింటికి వెళ్లాను. సావిత్రితల్లి గదిలో చాపమీద కూర్చోబెట్టి మాటల్లో మాటగా సావిత్రిపెళ్లిగురించికూడ యెత్తింది. పెళ్లికి సావిత్రి యిష్టపడినట్లుగాకూడ తేల్చింది.

'సావిత్రి మనస్ఫూర్తిగా యిష్టపడితే వేగంగా చేసెయ్యటమే మంచి' దని,యేడవలేక నవ్వేసి వచ్చేస్తూ ఆ పొరుగునే వున్న గణపతిగాడి యింటివేపు చూస్తూ వచ్చేశాను. నాకు ఆశాభంగం కలిగింది.

ఆ వేళ మధ్యాహ్నం పడుకొని లేచేసరికి అమ్మ సావిత్రితో వరండాలో కూర్చుని మాట్లాడుతోంది. లేచినవాడిని టక్కు వేసి నిద్రపోతున్నట్లు నటించాను. నాగురించి యేమీ మాట్లాడుకోకపోవటంతో లేచాను. నన్నుచూచి సావిత్రి లేచి వెళిపోబోతుంటే అమ్మ 'నీ కెందుకే కిష్టిదగ్గర అంత సిగ్గు ?'అని చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టింది బలవంతాన.

ముఖం కడుక్కోవాలి అన్నాను. అమ్మ సావిత్రివేపు చూసింది. సావిత్రి లేచి పెరటికి వెళ్లింది. అమ్మ వెళితే సావిత్రిని నే నడగవలసిన మాటలు అడిగి వుందును. అమ్మే అంది-పెరటికి వెళ్లి ముఖం కడుక్కో అని. మంచి సమయం దొరికిం దని వెళ్లాను. సావిత్రి చెంబుతో నీరు, సబ్బు అక్కడ పెట్టి వెళిపోబోతోంది.

'కాస్త నీరు పోయి సావిత్రీ' అన్నాను. తిరిగి వచ్చింది. ముఖం కడుక్కుంటూ 'నీ కిష్టపడిందిగా ఆ సంబంధం' అన్నాను మెల్లగా.

'అమ్మ చెప్పింది వాళ్ళది మంచి సాంప్రదాయ కుటుంబ మని. అమ్మకంటే నాకు హెచ్చు తెలుసా? ఆయన కష్టపడి సంపాదించుకొని తల్లీదండ్రిని పోషిస్తున్నారట. అలాంటప్పుడు యిష్టపడదా కిష్టీ'

సురగకప్పిన కళ్లు విప్పి సావిత్రివేపు ఒకసారి చూసి 'అయితే నిన్న రాత్రి యెందు కలాయేడ్చావ్'

'నిన్నటివరకు నన్ను నా సావిత్రీ అంటావను కోలేదు కిష్టీ. నా కిష్టికోసం నే నిప్పుడు వాళ్లని కాదంటే నాకు పాపం వస్తుందా ?' వంగి మెల్లగా అంటూ నా చేతులమీద నీరు పోస్తోంది.

ఆ మూడుముళ్లమీద మమకారం, భక్తీచూపిస్తున్న సావిత్రిఅవివేకానికి అప్పట్లో జాలి వేసింది.

మూడోరోజు వుదయానికల్లా నాన్న వచ్చారు. ఇంచుమించు ఆయన లోలోన పెద్దపెట్టున యేడుస్తున్నా రనిపించింది. అమ్మాయిపెళ్లి యే చికాకూ లేకుండా జరిగిపోయిందా అని అమ్మ అడిగింది. 'ఏం జరగటమే! యీ రోజుల్లో సామాన్యకుటుంబాలలో ఆడపిల్లల్ని కనటమే నేరంగా వుందే' అంటూ తల దించేశారు. ఆయన అంత వికలంగా, విచారంగా వుండటం నే నెప్పుడూ చూడలేదు. 'యేం చెప్పను వాడి బాధ. ఒకపిల్లకి పెళ్లిచేసేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చింది. ఇంకా యిద్దరు పెళ్లికి సిద్ధంగా వున్నారు. ఆర్జించిన దంతా యీ పెళ్లితో సరి. రక్కాడితే డొక్కాడటం. నన్ను పట్టుకొని బావురుమని యేడ్చాడే.....రామరామ...వాడి కష్టం శత్రువుకీ వద్దు......!' ఆ యేడుపుగొంతుకతోనే అన్నారు—'మన కిష్టడి పెళ్లికి దేవుడిసాక్షిగా ఒక్క దమ్మిడీ కట్నం పుచ్చుకోనే' అని.

మా దగ్గరివాళ్ల కష్టాలు మా కళ్లు తెరిచాయ్. అందుకే సుగుణ వాళ్ల కోడలయ్యేభాగ్యం పట్టింది.

ఆ వేళనుంచి నేనూ, సావిత్రీ కలుసుకోటానికి మా అమ్మ మంచి అవకాశం యిచ్చేది. అలాంటి అవకాశం యిచ్చినందుకు కారణంవిషయం ఆలోచించలే దప్పుడు. నాన్న కట్నం ఒక్క దమ్మిడీ పుచ్చుకో ననగానే సావిత్రిమీద అమ్మదృష్టి పడివుండవచ్చు.

నా శెలవులు ఆఖరుకాబోతున్నకొద్దీ సావిత్రి తత్వం నా కేమీ నచ్చింది కాదు.

'యీ కంపువీథుల్లో నాలుగుగోడల మధ్య పక్కిమంచాలమీద భక్తో యన్న దేవుళ్ల మధ్య—పొడుకోడానికీ ఆడుకోడానికీ, వలచి వలపించుకోడానికీ—శాంతికీ ప్రశాంతికీ—ఛీ—యీ కంపు' అని నేను...

'అదంతా కంపు కాదు. భక్తి లేకపోతే మంచి మనసు లేదు. మంచి మనసు లేకపోతే ప్రేమ లేదు. మనుషులు లేనిచోట మనం విహరించలేం. సంతృప్తి లేనిది బ్రతకలేం' అని సావిత్రి మెట్టవేదాంతం.

నేను పట్నం రేపు వెళిపోతా నని అనుకోగా సావిత్రి చీకటిపడ్డవరకు మా యింట్లోనే వుంది. సావిత్రిని విడిచిపెట్టి వెళిపోవటం నాకు కష్టంగానే వుంది. పట్నంఫాషన్లు జ్ఞాపకానికి వచ్చి సావిత్రిని మరచిపోగల నని అనుకున్నాను. నాన్న యింకా యింటికి రాలేదు. అమ్మ అంగట ఎవరితోనో మాట్లాడుతోంది. మెల్లగా పెరటికి జారాను. సావిత్రి ఒక్కరితే వుంది. గచ్చున దగ్గరకు వెళ్ళి సావిత్రిభుజంమీద చెయ్యి వేశాను. తల దించింది. నన్ను చూడగానే యీ సిగ్గెక్కడ పూడిపడుతోందో? నేను ఆమెతల యెత్తి ఆ కళ్లల్లోనికి చూశాను.

ఆగలేక పెదిమలను కలిపాను. సావిత్రి నా చేతుల్లోనించి జారి వంటయింట్లోకి వెళ్లిపోయింది.

వంటయింటిదగ్గరకు వెళ్లి వంగి లోనికిచూశాను. సావిత్రి చీరకొంగుతో కళ్లు కప్పుకొని కూర్చుంది.

'సావిత్రీ' అని మెల్లగా పిలిచాను.

'కిష్టీ' అని అలసటగా, అతిమెల్లగా అంది.

'ఏడుస్తున్నావా ?'

'హాఁ...కిష్టీ...హాఁ...లేదు, లేదు వెళిపో కిష్టీ'

సావిత్రిమాటల ధోరణి చూస్తే నా కేమీ పాలుపోలేదు. గబగబ దగ్గరకు వెళ్లాను. మళ్లా భుజంమీద చేయి వేశాను. లేచి నిలబడి కాస్త దూరంగా వెళిపోయింది.

'కిష్టీ వెళిపో...... వేగంగా వెళిపో కిష్టీ' — చిరాకు, జాలి, భయం అన్నీ యిమిడున్నాయ్ ఆ గొంతుకలో.

నేనుమాత్రం కదలలేదు. కూర్చున్నాను గుమ్మం దగ్గర.

'వెళ్లవుకదూ కిష్టీ' అంది కాస్త గంభీరస్వరంతోనే.

'ఎందు కేడుస్తున్నావో చెప్పంది వెళ్ల'నన్నాను.

'పెళ్లి అయ్యేవరకూ నన్ను ముట్టుకోకు కిష్టీ'

'దానికేనా యేడుస్తున్నావ్' అని పరిహసించాను.

'యీ భయం, యీ దొంగతనం యెందుకు కిష్టీ! ఎక్కడున్నా దగ్గరగానే వుంటాం. ఇప్పుడైనా వెళిపో కిష్టీ'

లేచి వెళిపోయానేగాని ఆమె మనసు అర్థం చేసుకోడానికి ప్రయత్నించలేదు. నిజానికి నాకా మాటలు నచ్చలేదు.

నా కోరిక నన్ను విడిచిపెట్టలేదు. ఆ మరుచటిరోజు ఒంట్లో నీరసంగా వుందని వుండిపోయాను. సావిత్రి యెక్కడా కనిపించలేదు. ఇంకోరోజు ఆగాను బలవంతంగానైనా సావిత్రిని నా సిద్ధాంతాలకు దాసోహం చెయ్యిద్దామని. కాని సావిత్రి కనపడలేదు. వాళ్ల యింటికి వెళ్లాను. ఎంతసేపు మాట్లాడినా సావిత్రిముఖం కనపడలేదు. తిరిగి వస్తూ సావిత్రికి వినిపిస్తుందేమో అని గట్టిగా అన్నాను. రేపు ప్రొద్దున్న వెళిపోతా నని. 'బుద్ధిగా చదువుకో కిష్టీ' అంది వాళ్ల అమ్మ.

సావిత్రి వస్తుందేమో అన్న భ్రమతో చాలా రాత్రివరకూ మేలుకొనే వున్నాను. నా నిరాశ సావిత్రిమీద అసహ్యాన్ని హెచ్చు చేసింది. ఇలాంటి వాళ్లని నిజానికి నాకు పెళ్లాడాలని లేదు. కల్చర్ లేని ఆడది మోహాన్ని అలవరచుకోలేదు. మల్లెపూల తెప్పమీద కూర్చోబెడితే తెప్ప మునుగుతుందేమో అని అమ్మో అని భయంతో కేకలు వేస్తుంది. హిమాలయంమీదకు పోతే చలిచలని యేడుస్తుంది! భస్తే యేం పోయింది-ఎడారిలో కలుసుకొని గాఢంగా

హృదయాలను కలుపుకొని చచ్చిన లైలామజ్నూలులా! మానవుని సాత్త్వైన మోహాన్ని యిలాంటి అర్థం లేని అజ్ఞానంలో పెట్టి నలిపి చీల్చి చెండాడుతున్నాం మనం అనాగరికులం! మనకంటె లక్షరెట్లు నాగరికులు యీ సృష్ట్యాదిని నివసించిన యిరువురు—ఆదాం, యీవు.

ఇలా ఆ రాత్రంతా మోహాన్ని స్తుతించటంతో ప్రపంచంమీదే అసహ్యం వేసింది. నాకూ సావిత్రికీ యెటువంటి సంబంధం లేదనుకున్నాను.

ఆ మరుచటిరోజు వుదయం బస్సుకోసం రోడ్డు మీదకు పోతూ సావిత్రియింటివేపు చూశాను. నాకెవరూ కనిపించలేదు. రోడ్డుమీద బస్సుకోసం చూస్తూ అప్పుడప్పుడూ సావిత్రియింటి పెరడువేపు చూస్తున్నాను. బస్సు యెక్కబోతూకూడా చూశాను. సావిత్రి నావేపు దీక్షగా చూస్తోం దనుకున్నాను.

౬

రెండో సంవత్సరం స్కూలుఫైనలుక్లాసులో కూర్చుంటా ననుకున్నాను. కూర్చున్నాను. పట్నం వెళ్లిన వారం రోజులవరకూ సావిత్రితో గడిపిన రోజులు జ్ఞాపకం వున్నయ్. తరవాత మరచిపోయా ననే చెప్పాలి. మళ్లీ మామూలుధోరణిలో పడ్డాను. యీసారి మరి కాస్త హెచ్చింది. సావిత్రిమీద చూపిన సాహసం యిక్కడా చూపించటానికి చాలా ఆందోళనపడుతున్నా. అందుకే అర్థం లేకుండా తిరిగాను.

ఒకనాటి రాత్రి. పదిగంటలు దాటింది. నిద్ర రావటంలేదు. లేచాను. గదికి తాళంవేసి అలా తల వంచుకొని నడచి వెళిపోతున్నాను. ఒక మనిషీ నా కెదురుగా రాలేదు. అలా రంగారాయపురం వెళిపోదా మనిపించింది.

నడుస్తున్నాను. నా మోహం నన్ను నడిపిస్తోంది. వీథిలో ఎలెక్ట్రిక్ లైటు వెలుగుతోంది. స్తంభానికి ఆనుకొని యెవరో కూర్చున్నట్లు గమనించాను. వేగంగా నడిచాను. నావేపు చూడలేదు. యేదో దీక్షలో వున్నట్లుంది..... దగ్గరగా వంగి భుజంమీద చెయ్యివేశాను. నా కళ్లల్లో నీరు తిరిగింది.

నా భుజంమీద నవ్వుతూ చెయ్యి వేసి 'యేడుస్తున్నారేం?' అప్పుడే మేల్కొని మత్తుగా పలుకరించిన ట్లుంది. నా జబాబు లేదుగాని నా రెండో చెయ్యికూడ భుజంమీదకు వెళ్లింది. నా ఒళ్లు ఒక్కసారిగా పులకరించింది.

'బ్రతుకుమీద విరక్తి పుట్టిందా?'

'హాఁ'

'మీ యి ల్లెక్కడ?'

'నా యిల్లు...' నాకు తెలివి వచ్చినట్లైంది. లేచాను. 'వస్తాను. దగ్గరగానే' మళ్లీ వచ్చినత్రోవనే తిరిగి గబగబ వచ్చేశాను.

తాళంతీశాను.

'నేనూ రావచ్చా?'

వెనుకకు తిరిగేసరికి యిం కెవరు? ఆయనే వేసిం దా ప్రశ్న.

'రండి' అన్నాను. నే నేం చేస్తున్నదీ ఆయన చూడలే దనుకుంటాను. ఆ గదిచుట్టూ యెన్నోసార్లు చూస్తున్నాడు. నేను మంచంమీద చారబడ్డాను.

ఆయన చేతిలోని కాగితాలు, పెన్సిలు బల్లమీద పెట్టూ 'మీకు పెళ్లి కాలే దనుకుంటా' నన్నాడు.

'లేదు' అన్నాను.

'ఇంకా చదువుకుంటున్నారుకదూ'

'హాఁ'

'మీ నాన్నగారికి హెచ్చు డబ్బుందికదూ?'

దీనికి నే నేమీ జబాబు చెప్పలేదు.

'యే స్త్రీనైనా ప్రేమించారా?'

'ఆ విషయం మీ కనవసరం అనుకుంటాను' అని లేచి కూర్చున్నాను.

'నే నిప్పుడు ఆ స్తంభందగ్గర కూర్చుని

వ్రాస్తున్న కథలో యీ ప్రశ్న వ్రాసి జబాబు దొరక్క గింజుకుంటుంటే మీరు వచ్చి నన్ను జాలిగా లాలించారు. ఆ ప్రశ్న మీకే వేస్తే వాస్తవికమైన జబా బిచ్చినందుకు కృతజ్ఞుడ్ని'

'నా దగ్గరనుంచి మీకు కావలసిం దేమైనా వుందా ?' అన్నాను, వచ్చే చిరాకును అణచివేస్తూ.

'ఉండబట్టే మీ వెనకాలే వచ్చాను. జీవితం మీద విరక్తి పుట్టినవాళ్లదగ్గర యెంతైనా వుంటుంది'

'నా కేమీ విరక్తి పుట్టలేదు. నాదగ్గర యేమీ లేదు.'

'అబద్ధాలు, ఆక్రోశాలు, అర్థంచేసుకోక పోవటం వాళ్లదగ్గరే వుంటుంది. వాళ్లదగ్గర మెసలంది మా కలం నడవదు'

యీ వ్యంగ్యం నా కర్థమయింది. 'యిక దయ చెయ్యం' డన్నాను కటువుగా.

'వెళిపోతానండీ! మా అన్నయ్యే నన్ను యింటి నుంచి యెందుకూ పనికిరా నని పొమ్మన్నప్పుడు మీ రెవరో ఐదునిముషాల పరిచయంతో పొమ్మనటంలో త ప్పేమీ లేదు. అయితే మా అన్నయ్యను పొద్దున్న లేవగానే తలచుకొని నాలో నమస్కరిస్తుంటాను. భర్తృహరి చెప్పినట్లు యింత విశాలమైన నేల వుండగా నిద్రపోడానికే చోటు దొరకదా ? ఆకులు అలము లుండగా కడుపే నింపుకోలేనా? నా బట్టలనీ నన్నూ చూసి మానవులే కాదు యీ బొమ్మలే పరిహసిస్తాయ్. కొద్దినిముషాలక్రితం మీలో మానవత్వం పోబట్టి నా మీద రెండు చేతులైనా అభిమానంగా వేయగలిగారు.'

ఆయన అంత జాలిగా మాటాడుతుంటే నే నేమీ అనలేకపోయాను.

'నేను మొదట యిలాగే జీవితం అంటే విరక్తి చెందాను. మీ కన్నీటిని చూసి నా తొలిప్రపంచంలో ఒక మనిషిని కలుసుకున్నా ననుకున్నాను. మీ గుండె మీ పిడికిటిలో పెట్టుకుంటేగాని యెదుటివారి కష్టాలు, కన్నీరు అర్థంచేసుకొని మెసల్లేరు.'

ఆయన అలా నిలుచునే వున్నారు యీ మాట లాడాక. నా కమీజుమీద నల్లిని చూశాను. దాని నెలాగైతేనేం, కాస్తకంగారుపడ్డాక పట్టుకున్నాను. ఆయన యెదురుగా యిన్నాళ్లలా చంపటానికి మనసు పోలేదు. లేచి వీధిలో పారేశాను.

'నేను పోతానండీ' అన్నా రాయన.

'అంత తొందరేం ?' అన్నాను.

'ఆ నల్లిలా నేనూ మీకు దాపురించానేమో అని భయంగా వుంది.'

ఆయన నవ్వుతూ అంటే నేను నవ్వాపుకోలేక పోయాను.

యీ ప్రపంచంలో ఆయనకూ, నాకూ అప్ప టికి పదినిముషాల పరిచయం. కోపంతో, కుళ్లుతో నిండిన నా మనసు నాకు తెలియకుండానే ప్రేమకని కరంతో నిండిన ఆయనమనస్సుకు దాసోహం అంది. నా పరాజయం గురించి తలచలేదు. గౌరవించే సూచ నలు నాలో అలముకున్నయ్.

ఆయన వెళిపోతుంటే ఆ మాటలు జ్ఞాపకానికి వచ్చాయ్—'ఇంత విశాలమైన ప్రపంచం వుండగా నిద్రపోటానికే చోటు దొరకదా ?' యీ మాటలు నన్ను కలవరపరిచాయ్. ఆరాత్రపుడు యే వీధిలో గరుకునేలమీద నిద్రపోతాడు ? పరుగెత్తాను. గప్పున చెయ్యి పట్టుకొని 'రండి' అంటూ వెనుకకు తిరి గాను. ఆయన మాటాడకుండా, ఆశ్చర్యపడకుండా నాతో వచ్చేశారు.

నా పరుపుమీద పడుకోమన్నాను. 'ఒక చాప వుంటే యిలా పారెయ్ తమ్ముడూ' అన్నారు. సంబంధం ముళ్లువేసుకుంది. నేను చాప వేశాను. చాపమీద కూర్చున్నారు. నేను కుర్చీమీద కూర్చొని 'మీరు వ్రాసిన కథ వినవచ్చా' అన్నాను.

చదివేముందు అన్నారు 'నాకు కట్టుకథలమీద నమ్మకం లేదు. ఎప్పుడూ వ్రాయలేదుకూడాను. యీవేళ కట్టుకథ వ్రాయా లని మనసు పుట్టింది. చాలావరకు వ్రాశాను.'

సుగుణా ! ఆ వర్ణనలు నే చెప్పలేనుగాని ఆ

కథ చెప్తాను.

'కరుణాకరం కథానాయకుడు. ఎప్పుడూ శృంగారం, సౌందర్యం అంటూనే పలవరిస్తాడు. ఆయనకోరికల్లో మొదటగా నిలిచింది మోహం. కళ్లు లేని లోకం కళ్లున్నవాళ్లని చూడనీయదని, ఒళ్లున్నను లేని లోకం ఒళ్లున్నవాడిని విహరించనీయదని అంటాడు. ఇలా అడ్డుపెట్టడానికి వుపయోగించబడే ఆయుధాలేవంటే—జాతిమతాలు, నీతినియమాలు, ఆచారవ్యవహారాలట. ప్రపంచంలో బ్రతకటం ఆనందంకోసమేనని, దానికి మోహం మొదటిమెట్టని చాటుతాడు. యీ కట్టుబాట్లకు లొంగిపోయిన యీ ప్రపంచంలో అసలు మోహానికి చోటే లేదంటాడు. ఏ అశ్వినీ లోకాలకోపోయి, ఏ గంధర్వకన్య మధురాతిమధురమైన పిలుపులోనో లీనమై, ఆడుతూ పాడుతూ సరోవరం మీద మల్లెపూల తెప్పమీద కూర్చొని కాలం అంతా వెన్నెలరాత్రులై జీవితంఅంతా యౌవనం చేసుకోవాలంటాడు.

మాటలతో సంఘాన్ని మరమ్మతు చెయ్యాలని భీష్మించుకున్నవాళ్ల అవస్థ యింతా అంతా కాదు. ఒకర్ని శుభ్రంగా బ్రతకనివ్వరు. వాళ్లు బ్రతకలేరు. ఈ ప్రపంచంమీద విరక్తి పుట్టి, బయలుదేరతాడు.

సమోన్నతమైదానాలు. మైదానాన్ని చీల్చుకొని పారే నది. నదిలోని కోనలు. కోనల్లో కిలకిలలాడే చేపలు. యీ ప్రమోదమైన వాతావరణంలో ఆడదానికోసం వెతుకుతాడు.

ముందుకు నడుస్తాడు. ఒక పొలంలో గొర్రెల మంద కనిపిస్తుంది. కుక్కలు బౌబౌమనటంతో నిద్రపోతున్న మంద ఒక్కసారి వులికింది. కరుణాకరం చెట్టెక్కి నక్కిపోతాడు. చెట్టుమీదినుంచి అప్పుడే నిద్రనించి లేచిన గొల్లపిల్లని వెన్నెల కాంతిలో చూస్తాడు. వీచే చల్లగాలికి జారిన పమిట చెంగు వెర్రెత్తించింది. ధైర్యంచేసుకొని చెట్టు దిగాడు. కుక్కలు ఒక్కసారి వచ్చి మీద పడ్డాయ్. గొల్లపిల్ల పరుగెత్తుకొనివచ్చి రక్షించింది. కరుణాకరం వేషం చూసి 'పట్నంబాబు దారితప్పి వచ్చా'రని పొదలు పొలాలు దాటించి రోడ్డు చూపించింది. ఇలా వెళిపోయారంటే పట్నం చేరుకుంటారు బాబూ అంది. ఆమెచెయ్యి హఠాత్తుగా పట్టుకొని 'ఎంత అందంగా వున్నా' వని కాగిలించుకోబోతాడు. ఆమె విదలించుకోడానికి ప్రయత్నిస్తుంటే వీడు యింకా గట్టిగా అదుముకోబోతుంటాడు.

ఆమె ఒడిలోని కత్తి తీసి గుండెదగ్గర పెట్టేసరికి గజగజ వణికిపోతున్నాడు. ప్రాణంకోసం ఆమె పాదాలని తాకడానికికూడ జంకలేదు.

ఆమె చెప్పిన త్రోవ కాదు, యింకొక త్రోవ పట్టాడు. అడవి ఝుమ్మంటోంది. ధైర్యంతెచ్చుకొని ముందుకు నడుస్తున్నాడు. ఏవో గర్జనలు వినిపిస్తున్నయ్. చెట్టెక్కి తెల్లవారేవరకు గడుపుదామనుకున్నాడు. కొండచిలవ—అమ్మో అంటూ కేక వేసి పరుగెత్తాడు.

ఏ గర్జనా లేదు—చిన్న పర్ణశాల. ఆ పర్ణశాలబయట వెన్నెల్లో కోయపడుచు. మచ్చలేని చందమామ. మెరుగుపెట్టిన బంగారం—మోహంపు సౌధాలలోని ముగ్ధ! ఆయనరక్తపుకెరటాల్లో విద్యుత్తు ప్రవహించింది.

గప్పున వెళ్లి ఆమెవక్షస్థలంపై చెయ్యి వేశాడు.

ఇక ఆమె—పడుచైనా పాలు పొంగింది. మరెవడో కాదు బిడ్డ. ప్రక్కనున్న విల్లు పాపడి ఆటవస్తువు. ప్రతిపలుకు జోలపాట.

'వెధవలు వూడిపడ్డారు. మోహాన్నంతా మొత్తేశారు! పట్నంలోనించి పిస్తోలుతో రాకపోవటం పెద్ద తప్పిదం చేశా' నని బాధపడతాడు.

ఒకడు ఆమెభుజంమీద చేయి వేశాడు. ఒరలోని బాణం కరకరా చూస్తోంది. ప్రేయసిని పట్టుకున్న తనని క్షమిస్తాడా? చంపుతాడు. ఆమెనీ చంపుతాడు. ఏం చెయ్యటం?

పసిపాపజీవనాధారంమీద దృష్టి పోనిచ్చే వాళ్లని బిడ్డల్లా ఆ కోయలు చూసుకుంటారని పాపం కరుణాకరం యెప్పుడూ వినలేదు.

పళ్లూ కాయలూ పులితోలులో చుట్టి యిచ్చి అడవి దాటించి వెళిపోయారు.

కరుణాకరం మనసంతా మండిపోతోంది. ఒళ్లంతా కాగిపోతోంది. యీ బాధ పోడానికి ఒకే ఒక సాధనం. పిస్తోలు—యెలా వస్తుంది?

ప్రపంచంలో తెలిసీ తెలుసుకోలేని వస్తువు కన్నా, విషయంకన్నా మోహం గొప్పది అని తన విశ్వాసాన్ని దృఢపరచటానికి ఎంతో సేపు పట్టలేదు.

పెద్దసరోవరం సమీపంలోనే కనిపించింది. వెన్నెలకాంతిలో నీటి వెలుగు. ఆ వెలుగులో మెరసి పోతోంది మల్లెపూల తెప్ప—తను అనుకున్న అశ్వినీలోకాలు...గంధర్వకన్యలు...కని విని యెరుగని మోహంపుస్వేచ్ఛ!

ఆయన చెవులు అమరసంగీతాన్ని విన్నాయ్. ప్రేమతో యిచ్చిన పళ్లూ కాయలూ కాళ్లదన్ని పరుగెత్తాడు. తను యింతకాలం కలగాసిన గంధర్వకన్యే యెదురుగా కనిపిస్తోంది.

తెప్ప ఒడ్డుకు కొంచెందూరంలో వుంది. కరుణాకరం ఒడ్డున నిలుచుని ప్రేమతో పిలుస్తాడు. ఆమె అలా తెప్పమీద నిలుచొని కొన్ని ప్రశ్నలడుగుతుంది.

‘నన్ను ప్రేమిస్తున్నావుకదూ?’

‘ప్రేమిస్తున్నానని నే చెప్పుకోను. నా జీవిత సర్వస్వం నివ్వే అంటాను.’

‘సరే ప్రేమిస్తున్నావ్—నీ మనసు నిర్మలంగా వుందికదూ?’

‘మోహం ఉన్న ప్రతిమనిషిమనసు నిర్మలంగానే వుంటుంది.’

‘ఎలా చెప్పగలిగావు?’

‘నీయెదురుగా నిలుచోగలిగాను కాబట్టి. మోహం యెరుగని మొద్దు గంధర్వాంగనతో మాట్లాడగలడూ?’

‘ఏం! దేవుని ప్రార్థించలేమా? మా పెద్దలు చెప్తారు మానవులు చాలా దైవభక్తి, సత్యం, సహనంతో నిర్మలమైన జీవితం గడుపుతారు; అంచేతే వాళ్లని ప్రేమించేవాళ్లమని. ఇది నిజం కాదంటావా?’

‘శుద్ధఅబద్ధం. మళ్లీ ఆ కంపువీథుల్లోకి, కుక్కిమంచాలమీదికి భక్తో యన్న దేవుళ్ల బొమ్మలమధ్యకు నన్ను యీడ్చుకపోకు. ప్రేమించుకోడానికి యీ దేవుళ్లూ, దెయ్యాలూ యెందుకు తీసుకొస్తావ్?’

‘పోనీ యే స్త్రీనైనా ప్రేమించావా?’

సుగుణా! యింతవరకేకమా ఆయన వ్రాసింది! ‘తమ్ముడూ! యీ ప్రశ్నకి నీ విచ్చిన జబాబు పనికిరాదు. అహంభావంవలన నాకా జబాబిచ్చావ్. కాని, కరుణాకరం మోహంలో మునిగున్నాడు. రేపు వ్రాశాక యెలా గుంటుందో చూద్దాం పదుకో’ మన్నాడు. ఆ మరుచటిరోజు మిగతా పూర్తిచేశాక నా చేతికిచ్చి ‘యీ కథ యే పత్రికకీ పంపించాలని లేదు. నీదగ్గరే వుంచుకొని రోజు కొకసారి చదువుకో’ అన్నారు. మిగతాకథ యిది.

‘లేదు లేదు. నిన్నుతప్ప మరెవరినీ ప్రేమించలేదు’

మల్లెపూల తెప్ప ఒడ్డుకు వచ్చింది. ఆమె కిలకిలా నవ్వుతోంది. కరుణాకరం తెప్ప యెక్కుతాడు. ఆమె గొంతెత్తి పాడుతూ ఆ వెన్నెల్లో మెల్లగా పడవ నడుపుతుంది. సరోవరజలంమీదినుంచి వీచే చల్లగాలి, మల్లెపూలుమీదినించి పరుగులెడుతూ సౌరభంతో మత్తెక్కిస్తున్నాయ్. కరుణాకరం తన్మయుడైపోతాడు. వెన్నెల్లో పడవ పోతోంది. అశ్వినీలోకాలన్నీ తనకి చేరువుగా వున్నాయని భ్రమపడతాడు. ఆమెదగ్గరగా వెళ్ళి కళ్లల్లోనికి చూస్తాడు. ఆమె తియ్యగా నవ్వి కళ్లు శృంగారంగా త్రిప్పుతుంది. ఒక్కసారి కళ్లు మూసి ఆమెను గట్టిగా కౌగలించుకొంటాడు.

కళ్లు తెరిచేటప్పటికి అంత సుందరమైన ప్రదేశం శ్మశానంలా కనిపిస్తుంది. ఆయనబాహువుల్లో అస్థిపంజరాన్ని చూసి కెవ్వన కేక వేస్తాడు.’

ఇదీ ఆయన వ్రాసిన కథ సుగుణా. యీ కథ నీ కెందుకు చెప్పానంటే యీ కరుణాకరమే అప్పటి కిష్టి అని తెలుసుకుంటా వని.

ఆయన రోజూ వచ్చేవారు. భోంచేశారా అని అడగటం నాకు అలవాటు లేదు. ఎంచేతంటే, నాకు జ్ఞాపకం వున్నంతవరకు భోజనం చెయ్యకుండా ఒక్క పూట వుండలేదు. అప్పుడప్పుడు పస్తుండేవా రని నాకేం తెలుసు?

ఆయనయెదురుగా ఆడవాళ్లని చూసి వెర్రి వేషాలు వెయ్యటంమాత్రం మానలేదు. దొంగచూపులు పారేస్తూ నేవున్నాను. ఏం తమ్ముడూ! తప్పు కాదా అని ఒక్కసారీ అనలేదు. ఆయనని యిప్పటికీ మరచిపోలే దంటే, దానికి కారణం ఆయన పడ్డ కష్టాలే. మహానుభావులను మన జ్ఞప్తిలో వుంచింది వారు పడ్డ కష్టాలేనా? నాలా ఆయన సుఖపడివుంటే ఆనాడే ఆయన్ని మరచిపోయివుండేవాడిని.

వాస్తవికరచనకోసం ఆయన పడ్డ బాధ, ఆ రచన హృదయానికి హత్తుకుందో లేదో అని గింజుకోవటం—యీ ఫలితంలేని శ్రమంతా చూసి నాకు చిరాకు వేస్తే నవ్వుతూ ఒకనాడు అన్నారు, 'నీ కంటికి కనిపించిన నా శ్రమకు ఫలితం లేదంటే నమ్మను. నా ఆనందంవల్ల వెలువడ్డ యీ కథలవూలాన యెవరికీ న్యాయమైన అపకారం జరగకపోతే చాలు. అదే ఫలితం.'

ఆ బట్టలతో ఆయనను నా యింట్లో వుంచటం నాకే అవమానంగా తోచింది. ఒకనాడు ఒక పేంటూ, బుష్‌కోటూ తీసి తొడగమని బలవంత పెట్టాను ఆ రెండూ చేతపట్టుకొని అంగట నిలుచున్నారు. ఎంతసేపటికీ తొడగకపోవటంతో నేను బయటకు వచ్చాను. రోడ్డుమీద యిటూ అటూ చూస్తుంటే యెవరికోసం చూస్తున్నారన్నాను.

'గాడిదకోసం' అన్నారు.

నేను స్తంభించిపోయివుంటే మళ్లా అన్నారు- 'గాడిద కష్టజీవి. నే నూరకే యిస్తే పుచ్చుకో దనుకుంటాను.'

నా వేపు తిరిగి 'తమ్ముడూ! నాలాంటివాళ్లకి దానం చేసి మన దేశంలో అడుక్కున్నవాళ్ల సంఖ్య వృద్ధి చెయ్యకు. డబ్బున్నవాళ్లు ఎలా ఖర్చుపెట్టడమో తెలుసుకోవాలి' అని తిరిగి తెచ్చి నా పెట్టెలో ఆ రెండూ పడేశారు.

ఒకనాటి రాత్రి చాప వేసుకుంటూ అన్నారు —'ఆత్మపరిశుద్ధి లేనిది గొప్ప కార్యాలు సాధించగలనా? ఇంకా జీవితం మొదటిమెట్టుమీదే వున్నాను. యీ బట్టలతో నీకు తలవంపు తెస్తున్నానుకదూ! ఎవరే బట్టలు వేసుకున్నా శరీరం కప్పుకోడానికే కదూ? ఎవరే పేర్లు పెట్టి పూజించినా ఒక్క దేవునికోసమేనా? నివ్వు రాము డంటావ్ గాని అల్లా అనటానికి అసహ్యించుకుంటావ్. అలాంటప్పుడు నీ దేశపు వేషం వేసుకుంటే బాగుంటుందికదూ!' అన్నారు. నే నేమీ జవాబు చెప్పలేదుగాని ఆయన లాలించి చల్లగా చెప్పే విధానాన్ని కొనియాడకుండా వుండలేకపోయేవాడిని. (సశేషము)

# సుగుణ

[పెద్దకథ]

శ్రీ బలివాడ కాంతారావు

(గతసంచిక తరువాయి)

## ౧౦

క్వార్టర్లీపరీక్షలింకా వారంరోజులున్నాయనగా వేగంగా రమ్మనమని రంగారాయపురంనుంచి వుత్తరం వచ్చింది. నాకు వెళ్ళాలని లేదు. కారణం నే నొక అమ్మాయి నాదే అనుకొని మురిసిపోతున్నాను. రచయితగారి బలవంతంమీద వెళ్ళాను.

నా మనసులో సావిత్రిని మూడనక్షత్రే దనుకున్నాను. పట్నంలో నా లాడ్జికి యెదురుగా క్రొత్తగా ఒక కుటుంబం దిగింది. తెరకప్పిన కిటికీ చాటుగా ఒక అమ్మాయి నావేపే చూస్తుండడం గుర్తించాను. రానురాను ఆ అమ్మాయి నాదే అనుకొని మురిసిపోవటం మొదలుపెట్టాను.

రంగరాయపురం వెళ్ళాక యెక్కడికీ వెళ్ళలేదు. ఇంటిలోనే కూర్చున్నాను. భోజనం అయ్యాక పరుపు మీద చారబడ్డాను. నాకు ఆ సాయంత్రమే తిరిగి వెళ్ళిపోదామని వుంది. అమ్మ నాకు దగ్గరగానే గోడకు చారబడి కూర్చుంది. పట్నంలో నా భోజనం, చదువుసంగతి యెత్తాక అంది: 'ఏం నాయనా, యెదిగిన పిల్లని యెంతకాలం వుంచుకుంటారు ? సావిత్రి వస్తే నా కేం విచారం వుండదు'

'ఏం సావిత్రి, ఏంటమ్మా యిదంతానూ. సావిత్రిని పెళ్ళిచేసుకుంటా నని యెవ రన్నారు? ' అన్నాను చిరాకుగా అమ్మవేపు చూస్తూ...

అప్పటి అమ్మపరిస్థితి చెప్పలేను. ఆ పెదిల ఒక్కసారిగా వణికింది. కళ్ళల్లో అంతలోనే నీరు అల ముకుంది. చెయ్యి నా చెంపవరకూ వచ్చిందికాని గప్పున ఆ కుడిచేతిని యెడమచేతితో పట్టుకొని గప్పున తల త్రిప్పి అలా లేచి వెళిపోయింది.

చాలాసేపటికిగాని అమ్మ తిరిగి రాలేదు. యీసారి బ్రతిమాలింది. సావిత్రికీ, నాకూ చిన్నప్పుడు ఆడుకోవటంతిప్ప మరేసంబంధం లేదని చెప్పాను.

'తప్పు నాయనా, అమ్మదగ్గర అబద్ధం ఆడతావురా ? ఆ వేళ రాత్రి పెరట యేం చేశావో నేను చూశానురా' అంది.

నేను కాసేపు మాట్లాడలేదు. నేను తిరస్కరించటం తప్పని నాకు తెలియకపోలేదు. కాని, సావిత్రిని కట్టుకుంటే నా కేమీ సుఖం వుండదని అనుకున్నాను. నా కీ పెళ్ళిససేమిరా యిష్టం లే దని చెప్పేశాను.

అమ్మ అలా గోడకు చారబడి మౌనంగా చాలా సేపు కూర్చుంది. నేను యింటి వాసాలవేపు చూస్తున్నాను పరుపుమీద చారబడే.

'ఆకలివేసేటప్పుడే అన్నం పెట్టిద్దా మనుకున్నాను. సరేలే నాయనా ! యిప్పుడు పోయే దేం లేదు. ఇదంతా నా మనసులోనూ, మీ నాన్నగారి మనసులోనే వుండిపోయింది. సావిత్రి మా పిల్లే అనుకొని ఆ డబ్బేదో మీ నాన్నగారే యిచ్చి పెళ్ళి

చెయ్యిస్తారులే' అని అక్కడనుంచి లేచి వెళిపోయింది.

సావిత్రి వచ్చి నన్ను దూషణలతో బాధపెట్టుందేమో అన్న భయం పోకనే. ఎదురింటి అమ్మాయి లేడికళ్లు నన్ను ఆవేళ సాయంత్రమే తిరిగి పట్నంలోనికి తీసుకొచ్చాయి. అయినా రెండురోజుల వరకు సరిగ్గా లేను. నే నేమీ యింటి విషయాలు చెప్పకపోవటం, యిలా చికాకుగా వుండటం చూచి మా రచయితగారు యింట్లో అంతా క్షేమమేకదా అన్నారు. 'అంతా క్షేమమే. పెళ్లి చేస్తా మంటే అప్పుడే వద్దని వచ్చేశా' నన్నాను.

'బాగా ఆలోచించే ఆ మాట అన్నావా తమ్ముడూ ?' అని ప్రశ్నించారు. ఈ ప్రశ్న నాకు చాలా క్రొత్తదిగా కనిపించింది. 'నీలాంటివాళ్లకి పెద్ద లోటు వుంది—ఆలోచించా మనుకుంటారుగాని నిజానికి ఆలోచించరు'

'అలాగా' అనేసి వూరుకున్నాను.

ఒకనాడు నాచేతికి ఒక కథ యిచ్చి 'నివ్వే చదువుకో తమ్ముడూ. నీలాంటివాళ్లకి చూపించినా నష్టంలేదు' అన్నారు. ఆ చివరి మాటల్లో అర్థం కొన్నాళ్లు పోయాకగాని తెలుసుకోలేకపోయాను.

"శేఖరం పెళ్లాన్ని పూర్తిగా నమ్ముతాడు. ఆడంబరం లేని మనిషి. విశాలహృదయుడు. భార్యకు ఆడంబరం హెచ్చయినా భర్తని ప్రేమించటంలో పూర్తిగానే ప్రేమిస్తుంది. అప్పుడప్పుడూ భర్తని ఆడంబరజీవితంలోనికి లాగుకపోటానికి ప్రయత్నిస్తుంది. ఆమెలా ఖరీదైన బట్టలు వేసుకోమని బలవంతం కూడ పెట్టుంది. కాని ఆయన చలించడు. శేఖరం భార్యని నిరాడంబరజీవితంలోనికి లాగుకోనిరావాలని యెప్పుడూ ప్రయత్నించలేదు. ఆమెకూ బుద్ధివుందని ఆమెయిష్టానుసారం సంచరించటానికి సంపూర్ణ స్వాతంత్ర్యం యిస్తాడు.

ఆమె మామూలుమనిషి కాబట్టి లొంగుబాటు వుండ దనుకోలేం. ఆమె ఒకసారి చూసిన వ్యక్తి మళ్లీ కనిపిస్తాడు. అప్పుడు అసహ్యించుకుందిగాని రానురాను ఆ వ్యక్తే భర్తకంటె అందంగా కనిపిస్తాడు. ఆవ్యక్తి ఆమెను వశపరుచుకోవాలని సర్వవిధాలా ప్రయత్నిస్తాడు. సౌందర్యం ప్రేమకు మూలం అని యెంచుకున్న లలిత వానికి లొంగిపోవటంలో ఆశ్చర్యం యేమీ లేదు. భర్త తన కిచ్చిన స్వేచ్ఛని ఆయనతో పొత్తు కుదుర్చుకోడానికి వినియోగించింది.

భార్య యిప్పుడు పొందిన మార్పుతో శేఖరం యేమీ కాలేదు. మామూలుగానే వున్నాడు. ఆమె లేని తలనొప్పులు, జ్వరాలు తెచ్చుకుంటే ఆఫీసుకు శలవుపెట్టి మరీ ఆమెక్రింద సేవ చేసేవాడు.

ఇలాంటి విషయాలు లోకంఅంతా కోడైకూసినా అసలువాడిచెవులో వెయ్యటానికి జడుస్తారు! శేఖరం ఒకవూరు పనిమీద వెళ్తుండేసరికి ఒక ఆప్త స్నేహితు డెదురై వున్న సంగతి చెప్పి యికనైనా మేలుకోరా అంటాడు. శేఖరం వాడిని గట్టిగా కౌగలించుకొని యేడుస్తాడు. స్నేహితుడు ఓదారుస్తుంటే మెల్లగా నవ్వి 'నేనూ, నా పెళ్లాం మామూలుమనుషులంరా. నా స్నేహితుడు మామూలుమనిషి కాడనే నా గర్వం యీ ఆనందబాష్పాలని స్రవింపచేస్తోం' దంటాడు.

ఊరికి వెళ్లలేడు. ఒక్కడే జనసంచారం లేని చోట కూర్చొని తను అంతగా ప్రేమించినభార్య యిలా చేసిందంటే నమ్మలేడు. చీకటిపడ్డవరకు అలా ఆత్మవిచారణ చేసుకొనే కూర్చుంటాడు. ప్రేమమయమైన జగత్తులో ప్రేమ కెప్పుడూ పరాజయం లేదని ఆశతో యింటికి వచ్చేస్తాడు.

భార్య 'లేరు. ఊరికి వెళ్లారు' అని అంటూ తలుపు తీస్తుంది, యింకెవరో అనుకొని. లోనికి పోతాడు. మంచంక్రింద దాగున్న ఆ వ్యక్తి భయంతో వణికిపోతుంటాడు. 'నివ్వూ నాలాంటి మనిషివే తమ్ముడూ ! నాలా నీకూ కోరిక లున్నాయ్. నీకూ సుఖపడా లని ఆశ వుంది. పాపం ! చలితో వణికిపోతున్నావ్. మంచంమీద పడుకొని దుప్పటి కప్పుకో తమ్ముడూ. పరిచర్యలు నేనైనా, లేక లలితైనా చేస్తాం' అని ఆదరిస్తాడు. ఆ వ్యక్తి సిగ్గుతో లేచి వెళిపోతాడు.

ఆయనమీద చూపించిన జాలి అప్పట్లో భార్య మీద చూపించలేకపోతాడు. ఆయన వెళ్లగానే భార్యకు ఒక్క చెంపపెట్టు తగిలించి మంచంమీద పడుకోబెట్టాడు.

చాలారాత్రివరకూ యిద్దరూ అలా మౌనంగానే వుంటారు. అప్పటికిగాని శేఖరంమనసు యథా స్థాయిలో పడలేదు. అమానుషంగా ప్రవర్తించినం దుకు క్షమించమని భార్యను వేడుకుంటాడు.

ఆమరుచటిరోజునుంచి ఆమె కొంత మారినా ఆ వ్యక్తిమీద దృష్టిమాత్రం పోలేదు. ఆయన ఆమెను విడిచిపెట్టినట్లు లేదు. శేఖరం తన మనసును అదుపులో వుంచుకోడానికి యెన్నోవిధాల ప్రయత్నిస్తాడు. భార్యను 'తప్పు, అలా చెయ్యొ'ద్దని బ్రతిమాలుతాడుకూడాను. ఉన్మాదిరిలా మారిపోతుంది. శేఖరం మీద యెదురుతిరుగుతుంది. మరేమీ మాటాడకుండా యింటినుంచి వెళిపోతాడు. మొదట యెక్కడైతే జ్ఞానోదయమైందో ఆచోటునే వెళ్లి కూర్చుంటాడు. ఒకనాడు ఆయనతొడమీద తల పెట్టి కళ్లల్లోనికి నవ్వుతూ చూస్తూ పాడిన లలిత జ్ఞాపకానికివస్తుంది. ఇప్పుడలా పాడమంటే పాడదు. ఉద్రిక్తు డవుతాడు. ఆమె కాదంటే విషం త్రాగించి తొడమీద ఆమె తల పెట్టి ఆ అనుభూతి పొందా లనుకున్నాడు. కాని తనకోసం నిండుప్రాణాన్ని బలిపెట్టడం తలచుకొని నాలుకకరచుకున్నాడు. మళ్లీ ఆయన అక్కడనుంచి లేచేటప్పటికి ప్రేమమయమైన జగత్తులో ప్రేమకు పరాజయం లేదని నిర్ధారణకు వస్తాడు.

భార్యను లాలిస్తాడు. నీలాంటి భార్య దొరికి నందుకు గర్విస్తున్నా నంటాడు. నీ వేం చెప్తే నే నలా చేస్తాను. నన్నింట్లో వుండమంటే వుంటాను. పొమ్మంటే పోతానుగాని నిన్ను స్తుతిస్తూ మిగతా జీవితం గడుపుతాను అంటాడు. పోనీ యేదైనా పను న్నప్పుడే యింటికి వస్తాను. వేరెక్కడైనా కటిక నేలమీద పడుకోమంటే పడుకుంటాను. ఇలా భార్యను మాటలతో ఆదరించటం కాకుండా తనే వంట చేస్తా నని చెప్పేవాడు. చీపురు పట్టుకొని నేనే తుడుస్తా నని తుడిచేవాడు. వేడినీరు కాచి, సబ్బు, స్నానాల గదిలో భార్యకోసం అమర్చేవాడు. నీ కేరకం చీర లిష్టం, చెప్పు, తెస్తా ననేవాడు. ఇలా ఆమె సేవ చెయ్యటమే తన పరమావధిగా పెట్టుకున్నాడు. ఆ వ్యక్తితో మాట్లాడుతుంటే విననట్టే వూరుకొనే వాడు. వాళ్లే కంగారుపడుతుంటే వాడు వెళిపోయాక భార్యదగ్గరకు వెళ్లి నాదగ్గర జడుస్తే నే నీ యింట్లో వుండలే నంటాడు. నివ్వు కడుపునిండా తినకపోతే నా కాకలివేస్తుంది. నివ్వు బాధపడితే నేనూ బాధ పడతాను. అని యిలా యెన్నోవిధాల ప్రేమ తొణి కిసలాడేటట్లు భార్యను లాలిస్తాడు.

నిజంగానే యీసారి ఆమెకు జ్వరం వచ్చింది. ఆజ్వరం రావటానికి ఒక కారణం - ఆమె మామూలు మనిషి. రెండో కారణం శేఖరంఅపారప్రేమ. డాక్టరు మందిస్తున్నాడు. శేఖరం రాత్రి పగ లనకుండా భార్యక్రింద సేవ చేస్తునేవున్నాడు ఆ వాడిన ముఖాన్ని ఆ వ్యక్తి ఒక్కసారే చూశాడు. ఎలా వుం దని వెగటుగా పలకరించాడు. జబా బివ్వటానికి బాధ పడింది. శేఖరం వచ్చి జబాబు చెప్పాడు 'రోజూ నివ్వు కాస్సేపు వచ్చి కూర్చో తమ్ముడూ! మనిషి దగ్గరగా వుంటే జబ్బువున్నవాళ్లకు ధైర్యంగా వుంటుంది'—యీ మాటలతో ఆయన వెళిపోయాడు గాని ఆమె చనిపోవటమే మంచి దనుకుంది. ఆమె కళ్లల్లో నీరు చూసిన శేఖరం, తన ప్రవర్తనలో తప్పుంటే క్షమించమని వేడుకుంటాడు. పరితా పంతో కుళ్లి పోతున్న ఆమె మాట్లాడదు.

'నన్ను నేను ప్రేమించుకోలేను. ప్రేమించు కొనివుంటే నివ్వంతగా ఆనాడు చెప్పినందుకు ఆ ఖరీదైన బట్టలే కట్టిందును. అసమర్థుణ్ని. అసమర్థుణ్ని కట్టుకున్నందుకు నా తప్పులను పరిదిద్దు లలితా' అని భార్యను వేడుకుంటాడు.

ఆమె గట్టిగా కళ్లు రెండుచేతులతో మూసు కుంటుంది. అలసిపోయి ఒక్కసారి కెవ్వున కేక వేస్తుంది. కళ్లంట నీరు కారిపోతుంటుంది. భార్య పరివర్తనాన్ని గ్రహిస్తాడు శేఖరం.

'పవిత్రనదులలో సుడిగుండా లున్నాయని పూజించటం మానలేదు. నీ పవిత్రజీవితంలో యీ సంఘ

టన జరిగిందని నిన్ను ప్రేమించటం మానలేను' అని భార్యపాదాలమీద చెయి వేసి చెప్తాడు.

ఆ ప్రేమకు తగననుకుంటుంది. అయినా ఆయన కోసం బ్రతకాలనుకుంటుంది. ఆ రెండు రోజులలో మామూలుగా లేచి కూర్చుంటుంది.

ఆ వ్యక్తిమాత్రం ఆమెను విడిచిపెట్టేటట్టు లేడు. యీసారి బలవంతంచేస్తాడు. బ్రతిమాలుతుంది. వెళిపోమంటుంది. కాని మొదటి చనువే వుపయోగిస్తాడు. ఆమె సహించలేక కాళ్లతో తంతుంది. ఆ కామోన్మాదికి శేఖరం నేరస్థుడుగా కనిపిస్తాడు. రేపు తెల్లారేసరికి శేఖరంతల నరుకుతానని శపథం చేస్తాడు. వెళిపోతున్నవాడిని పిలుస్తుంది. 'ఆయనని చంపకండి. యీ యింట్లో ఒక మహాత్ము డున్నాడు. యిలాంటి పవిత్రమైన గుడిలో ప్రణయకాండజరపడం నా కిష్టంలేదు. సరే మీతో ఎక్కడికి వచ్చేమన్నా వచ్చేస్తాను' అంటుంది.

'రేపు వేకువఝామున వస్తా'నని వెళిపోతాడు.

ఆరాత్రంతా మేలుకొనే వుంటుంది. నిద్రపోతున్న శేఖరంపాదాలని పువ్వులతో పూజిస్తుంది. దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి గుండెను గట్టిగా పట్టుకొని యేడ్చేస్తుంది. తలను చేతులతో అదిమి పట్టుకొని ఆ పాదాలదగ్గర పెట్టి కళ్లు మూస్తుంది. ఆయనని కౌగలించుకోలేక ఫొటోని గట్టిగా పట్టుకొని కెవ్వున కేక వేస్తుంది.

శేఖరానికి తెలివివచ్చి భార్యను తన ప్రక్కనే పడుకోబెట్టుకుంటాడు. 'నివ్వు ఎంత బాగున్నావ్ లలితా' అంటూ ఆమెను ఓదారుస్తాడు.

తెల్లవారింది. శేఖరం లేచేటప్పటికి భార్య కనపడదు. అలా నేలమీద చాలాసేపు కూర్చొని శూన్యంలోనికి పిచ్చిగా చూస్తాడు.

మూడోరోజు పత్రికలో 'ఒక పతివ్రతఅమర జీవితం' అనే శీర్షికతో వున్న విషయాన్ని చదువుతాడు. లలిత అనే యించుమించు పద్ధెనిమిదేళ్ల యువతి మృతకళేబరాన్ని ఒక సత్రములోని గదిలోనించి పోలీసులు బయటకు తీశారని, ఆమె అక్కడ వ్రాసి పెట్టిన వుత్తరంలో ఒక్క లలిత అనే పేరుతప్ప ఆమె కేవూరో లేదని. ఆ వుత్తరంలో విషయా లివట— 'నాది యీవూరు కాదు. నిన్న నేనూ, యింకొక వ్యక్తీ కలిసి యీవూ రొచ్చాం. సుబ్బరాయుడుగారి సత్రంలో దిగాం. నిన్నరాత్రి ఆయనకు విషం యిచ్చి శాశ్వతనిద్రపుచ్చి తలుపు తాళం వేసి యీ సత్రంలోనికి వచ్చాను. నాభర్తపేరు నాకు ఎత్తాలని లేదు. ఆయన ఒక మహాత్ముడు. నే చంపిన వ్యక్తికి ఆయన స్వతంత్రం యిచ్చారు. లోకం కోడై కూసింది. నిజానికి ఆయనకూ నాకూ యేమీ లేదు. తనతో నా భర్తని విడచి వచ్చేస్తేగాని, లేదా అంటే ఆయనను ఖూనీ చేస్తానని బెదరించాడు మొన్ననే. నాకింకేమీ పాలుపోలేదు. యీ భూమిమీద ఒక మహాత్ముని వుంచటానికి నాలాంటివాళ్లు చచ్చినా పోయేదేమీ లేదు. యీ వున్మాదితో యిలా వచ్చేశాను.

'ఇక్కడ వుంచిన డబ్బు దహనసంస్కారాలకు చాలనుకుంటాను. ఇద్దరినీ కాల్చేటప్పుడు వాడి చితిమీది పొగ నా చితిమీదికి రాకుండా చేయమని యీ మానవలోకాన్ని ప్రార్థిస్తున్నాను.'

శేఖరం చదివి అలా ఆకాశంవేపు చూశాడు. తను ప్రేమమయజగత్తులో ప్రేమకు పరాజయం లేదని ఎక్కడైతే తెలుసుకున్నాడో అక్కడకు పరుగెత్తి ఆచోటుమీద సాష్టాంగపడి ప్రణమిల్లుతాడు.

'సుగుణా! యీ కథ నాచే చదివించి 'తమ్ముడూ! ఆ వ్యక్తికి వచ్చిన చావు ఎంత హేయమైనదో ఆలోచించు.' అన్నారు.

నేను వూరుకున్నాను యింకా ఆ కథలోని ఘట్టాలే నా మనసులో వుండిపోవటంచేత.

'నేను కొన్నాళ్లల్లో యీవూరు వదిలేస్తున్నాను. నన్ను జ్ఞాపకంవుంచుకుంటావని ఒక పని చెయ్యబోతున్నాను. కబుర్లవల్ల నే నేమీ మంచిని సాధించలేను. యిదిగో కార్డు. ఒక వుత్తరం వ్రాసిపెట్టు' అని అందిచ్చారు.

ఆయన చెప్తుండగా వ్రాశానిలా. 'మహారాజశ్రీ నాన్నగారికి. నమస్కారములు. యీవుత్తరం అందిన వెంటనే మీరు బయలుదేరిరావలసిం దని ప్రార్థిస్తున్నాను. చిత్తగించవలెను' అని చెప్తూ సంతకం

పెట్టు తమ్ముడూ అన్నారు. నా కేమీ అర్థంకాక ఆయనముఖం వేపు చూశాను. ఆయనముఖంలో నా కేం కనిపించలేదుగాని సంతకంమాత్రం పెట్టకుండా వుండలేకపోయాను. ఎడ్రసు వ్రాయించి చేతిలోని కార్డు తీసుకొని వెళ్లి పోయారు.

## ౧౧

నాన్న వచ్చారు. రచయితగారు నాన్నగారికి నమస్కరించి 'నేనే బాబూ మీకు రమ్మనమని వుత్తరం వ్రాయించింది' అన్నారు. మానాన్నకు ఆయనను పరిచయం చేశాను.

ఆవేళ సాయంత్రం ఆయనా, యింకొక మేష్టారూ వచ్చారు. ఆ పిలకా, ఆ వాటం చూసి యింతకుముందు ఆయనకు నేనూ, మా బృందం కమ్మకట్టాం. ఆయన యింకొక హైస్కూల్లో మేష్టారు. మళ్లీ ఆయనను చూడగానే 'యేం పిలకా?' అందామనిపించింది. కాని ఆయనా మానాన్నా, ఎంతో దగ్గరవాళ్లలా పలకరించుకున్నారు.

ఇద్దరూ కుశలప్రశ్నలు వేసుకున్నాక నా విషయం వచ్చింది. మా రచయితగారు మొదలుపెట్టారు 'బాబూ! మీరు డబ్బున్నవాళ్లు. కాని పిల్లలను పెంచటం మీకు తెలీదంటున్నాను. క్షమించండి. మీ అబ్బాయి యిలా పాడవటానికి కారణం మీరే అంటాను. అయిందేదో అయిపోయింది. పూర్తిగా పాడవకుండా యిప్పుడైనా మేల్కొనటం మంచిదని వుత్తరం వ్రాయించాను. కుర్రవాడి వూహలు వేరే అవటంవల్ల చదువుమీద శ్రద్ధ లేదు. పోకిల్లా అయి పోకిరీ వేషాలు నేర్చుకుంటున్నాడు. నే ననుకున్న గురువులు మీ స్నేహితులుకాబట్టి మ రే అపోహలూ పడక్ఖ్లేదు. మీ అబ్బాయిని ఆయనచేతుల్లో పెట్టండి. ఇంతకంటే పెంకిఘటాల్ని వంచేశారు. అసలు యిలాంటివాళ్లు వేగంగానే లొంగిపోతారు. ఆయన యింట్లోనే వుంచేయటం మంచిది!'—ఆయన అంత చెప్పాడేగాని అనవసరం. మా నాన్నమనసు సావిత్రిని నేను పెళ్లాడ ననటంతోనే మారిపోయింది.

'మీ యిష్టం' అన్నారు. 'వాడిని బాగుచేసే పూచీ మీది. వాడికీ, నాకూ యేమీ సంబంధం లేదు. మీకూ నాకే యిక. మీ పేరనే డబ్బు పంపిస్తాను' మేష్టారుచేతిలో చెయి వేసి నాన్న అన్నారు. ఆ పిలకని చూసి వెక్కిరించేబదులు భయపడే పరిస్థితి వస్తోందని నా కెక్కడలేని కోపం వస్తోంది నాన్నమీద, రచయితమీద. నాన్నమీద తిరగబడి నే చెయ్యగలిగింది యేమీ లేదని నాకు తెలుసు. పండిన బుర్ర. జడిపింపులకు లొంగేరకం కాదు. అక్కడనుంచి లేచి గప్చున బయటికి జారిపోయాను. దీని కంతటికి ముఖ్యకారణం నాదగ్గర చేరిన ఆ నల్లి అని మండిపోతున్నాను లోపల.

'యీ వేళ ఒక ఆరుజతలు ఖద్దరుబట్టలు తీయండి మీవాడికి. తరవాత యీ పెట్టెల్లోని బట్టలన్నీ యెవరికైనా దానం చెయ్యండి' అని ఆ మేష్టారు గంభీరంగా అంటున్న మాటలు బయట నిలపడ్డ నా చెవుల్లో పడగానే మరి అక్కడ వుండలేకపోయాను. నా వెనకాలే మా రచయిత వచ్చారు.

'తమ్ముడూ! నీ విషయంలో యేం చేసినా యేం మాట్లాడినా నీకు తెలిసినట్లుగా చేశాను. పాపం అనే పదంమీద నీకు విశ్వాసం వుంటే నామీద ద్వేషం మనసులో మూలగనియ్యక. నన్ను లెంపలు వాయించు, సంతోషంగా స్వీకరిస్తా' నని ముఖాన్ని నాదగ్గరగా పెట్టుంటే—అబ్బా! అదేమిటో ఆ ముఖం చూశాక నా చేతులే కావు, శరీరం అంతా వణికింది. ఆ తలమీద అభిమానంగా ఛేయి వేశాను.

ఆమరుచటిరోజు ఆ యిల్లు ఖాళీచేస్తుండగా ఆ యెదురింటాయన 'ఏం తమ్ముడూ ఖాళీ చేస్తున్నావేం?' అని వచ్చి పలకరించారు. ఆయనతో మాట్లాడాక ఆ కథలోని శేఖరానికీ యీయనకూ యేం భేదం లే దనిపించింది. మా రచయితగారిని మనసులో నమస్కరించకుండా వుండలేకపోయాను. ఎదురింటాయనకు ఏదో ద్రోహం తలపెట్టా నని బాధపడ్డాను కూడాను.

మేష్టరుగారింట్లో నే గడిపిన జీవితం సూక్ష్మంగానే చెప్పేస్తున్నాను. రోజుకురోజూ నాలో వచ్చిన మార్పు, ఆసంఘటనలు చెప్తే చాలాకాలం అవుతుంది. వారింట్లోనే నా భోజనం. మేష్టారుగారి భార్యను చూసి అమ్మ అని పిలవకుండా వుండలేకపోయేవాణ్ని. చదువుకొని ఆడవాళ్లు మొద్దులే అనుకున్న నా వూహ

యెంత తెలివిహీనమైందో ఆమెను చూశాకే తెలుసుకున్నాను. ఆమెకు పిల్లల్ని పోషించటం తెలీదని యెవ రనగలరు ?

నా వేషం వెంటనే మారిందిగాని నా భాష మాత్రం అంత వేగంగా మారలేదు. నా యీ కొత్త వేషం చించుకున్నట్లుండేది. బడిలో కూర్చోడానికి సిగ్గువేసేది. యీ మార్పుతో అందరికంటే ఆవూల కూర్చున్న అమ్మాయిలు పరిహసించటం చూసి నా కేడుపు వచ్చింది. కాని యేం చెయ్యను ? కోపంతో యింటికి వచ్చేసరికి ఆ పిల్లలు అన్నయ్యా అంటూ నన్ను ఆడించటం. వాళ్లే నాకు కథలు చెప్పేవారు. ఆ అమ్మ దగ్గర కూర్చుని కొడుకుకంటే హెచ్చుగా చూసుకుంటుంటే యివన్నీ మరచిపోయేవాడ్ని.

మా రచయితగారు రోజు కొకసారైనా కలుసుకొనేవారు. ఆయన కున్న స్నేహితులగురించీ, వాళ్ల నిరాడంబరజీవితంగురించీ చెప్తుండేవారు. ఇవన్నీ విన్నాక రానురాను నా వేషంమీద నాకే గౌరవం కలగనారంభించింది.

నే నక్కడ గురుకులవాసం చేసి విద్య నేర్చుకున్నా ననవచ్చు. ఆ యింట్లో వున్నప్పుడు నా మనసెంతో ప్రశాంతంగా వుండేది. ఒక చాప తలగడ యిచ్చి నే పడుకొనేవరకు మేష్టారు దగ్గరే కూర్చొని ప్రపంచంలోని విజ్ఞానవిషయాలు చెప్తుండేవారు. ఏ తప్పైనా చేస్తే నేనే ఆ తప్పు పోల్చుకొని సరిదిద్దుకోవాలి. వేకువఝామున లేపి ఆయన దగ్గర కూర్చొని చదివించేవారు.

అంత విలాసాల్లో తిరిగినవాడిని, యీ కట్టుబాట్లకు, యీ నిరాడంబరజీవితానికి లొంగిపోయానంటే కారణం లేకపోలేదు. ఆయనప్రపంచజ్ఞానం యెదుట, ఆ నిర్మలమైన మనస్సుయెదురుగా, ఆ చల్లనైన కుటుంబందగ్గర నేను వాళ్లని గౌరవించాలని అనుకోకుండానే గౌరవిస్తున్నాను. నిజానికి అదే గౌరవం అనిపించుకుంటుంది.

నాలో శృంగారంమాత్రం పూర్తిగా చచ్చిపోలేదు. యిప్పటికీ ఆ శేషం వుంది. యీ విషయం మాత్రం ఆయన గుర్తించారని నాకు తరవాత ఆయన చేసిన పనికలన తెలిసింది. ఆ కుటుంబలభిమానానికి, గొప్పతనానికి జోహారు లర్పించుకున్నాను. వేషం చూచి యెవర్ని వెక్కిరించానో వాళ్లలోనే జీవితం అంటే యేమిటో తెలుసుకొనే మహత్తు వుందని గుర్తించాను. నా మనసుకు నొప్పి లేకుండా నేనే యిది నిజం అని ఒప్పుకునే అవకాశాలను కల్పించారాయన.

మా రచయిత వెళ్లిపోయేముందు నన్ను తనతో కొంతదూరం తీసుకవెళ్లారు. ఆయన అన్నారు 'తమ్ముడూ ! నీవు పెళ్లి వేగిరంగా చేసుకోవటమే మంచిది. పెళ్లాన్ని యెంచుకొనేటప్పుడుమాత్రం నీకంటే తెలివైన పిల్లని పెళ్లాడు. మేష్టరుగారు నీ అర్థంలేని అహంభావాన్ని ప్రేమ, జ్ఞానంతో యెలా అణిచారో ఆమెకూడా నీ దాంపత్యజీవితంలో అలా అణచివేస్తుంది. యీ అహంభావం యిప్పుడు తాత్కాలికంగా జ్ఞానంయెదుట అణగుంది. మేష్టరుగారిని విడిచిపెట్టాక మళ్లీ అది తలయెత్తుతుంది. నీ బ్రతుకు శుభ్రంగా పోవాలంటే నీకంటే తెలివైన పిల్లని పెళ్లిచేసుకో. తెలివైనవాళ్ల మనసు మనం యెలా ఆకర్షిస్తామంటావ్ ? నాకు తెలిసినమట్టుకు తెలివైనవాళ్లు యెదుటివారి చిత్తశుద్ధిని కాంక్షిస్తారుగాని ధనకనకవస్తువాహనాలు, డాంబికవేషాలను చూస్తా రని అనుకోను.'

ఇదే సుగుణా, నా మనసులో నాటుకొని నిలచిపోయింది. ఆ సంవత్సరం వేసవిసెలవులలో రంగారాయపురం వెళ్లలేదు. మేష్టరుగారు పంపించనని మా నాన్నకు వుత్తరం వ్రాశారు. విజ్ఞానంకోసం ఆయన యిచ్చిన వుపన్యాసాలతో నా మన సెప్పుడూ నిండిపోయేది. ఆసంవత్సరం పాసయ్యాను. చాలా మంచి మార్కులు వచ్చాయి. నాన్నను పిలిపించి 'మీ అబ్బాయికి యీ చదువు చాలు. ఉద్యోగంమీద దృష్టి పోతే మంచిది. ఆ పని నే చెయ్యగలనని అనుకుంటున్నాను. మీరు పెళ్లి ప్రయత్నంలో వుండటం మంచి'ద న్నారు. దీనినిబట్టే ఆయన నన్ను కనిపెట్టుకొనే వున్నారని తెలుసుకున్నాను. శృంగారంమీద నా దృష్టి పడకుండా మరలిద్దామని ఆయన యీ వుద్దేశపడివుండవచ్చు.

ఉద్యోగంలో చేరాను. ఏవో సంబంధాలు వచ్చాయిగాని నా కేదీ నచ్చలేదు. యివేవీ నాకు నచ్చవని తెలిసినప్పటికీ వెళ్లి చూసి యెదుటివారికి చాలా ఆశాభంగం కలిగించేవాడిని. మన సంఘంలో యిది చాలా తప్పుపని అని నే తరవాత బాధపడ్డాను.

యీవూరు బదిలీఅయింది. యీ పెద్దపట్నంలో వేషానికే గౌరవం. డాంబికానికే విలువ. శృంగారానికే ప్రాధాన్యం. నా మనసు మళ్లీ వెనుకటి రోజులను తలచకుండా వుండలేకపోయింది.

సుగుణా, నా జీవితంలో ఆరోజు మరచిపోలేను. రోడ్డుమీద తలెత్తుకొని నడుస్తూ పోతున్నావ్. చూశాను. నే నెందుకో—కాదు—ఏదో పరిచయం వున్నట్లు—ఆగిపోయాను. నా ప్రక్కన వున్న గుమాస్తా నవ్వాడు. 'యింతా అంతా కాదు గర్వం. ఎంద రొచ్చినా నచ్చలేదు. వెర్రోడులా అలా చూస్తావేం ?' ఆయనమాటలనుబట్టి, తరవాత ఆయనకు నీ గురించి కనుక్కోగా తెలిసిన విషయాలనుబట్టి చూస్తే నేనేదో గగనకుసుమంకోసం ఆశిస్తున్నా ననిపించింది. నిన్ను చూశాక నాలో సంచలనం కలిగింది. కాని నీలో నా కేమీ కనుపించలేదు. చింతా చీకూ లేకుండా హాయిగా నడచి వెళ్లిపోతున్నావ్. నాకంటె తెలివైనదానివని నిర్ధారించుకున్నాను. మా రచయిత గారి సుభాషితాలు ఆధారంగా చేసుకొనే మీ యింటికి పెళ్లిచూపులకు వచ్చాను. నా కళ్లల్లో నీటికి కారణం నీవు వూహించిందే నిజం.

ఏదో నవలలో చదివాను—పల్లెటూరిపిల్ల ప్రేమ గురించి. ప్రేమించినవాడు ఆమెను మరచిపోయినా యింకా వాడికోసమే పలవరించి ఆఖరికి ప్రాణత్యాగం చేస్తుంది. సరి ! ఇవన్నీ కల్పితకథలు. వాస్తవికజీవితంలో యేమీ లేదు. సావిత్రి ఐదునెలల క్రితమే పెళ్లి చేసుకుంది. ఇప్పుడు సుఖంగా కాపరం చేస్తోంది. ఇలాంటివాళ్లుండబట్టే ఎవడో కవి ప్రేమ గ్రుడ్డి దన్నాడు. సుగుణా ! యీ రాత్రి జాగరం చెయ్యించావ్—బల్లున తెల్లారేవరకైనా పడు...

యింకా నా మాటలు నా నోటనే వున్నయ్. సుగుణ 'ఉహూం హూం... అమ్మా' అంది అలసటతో బాధగా.

'ఏం సుగుణా' అన్నాను ఆత్రుతగా.

సుగుణ యేమీ మాటాడకుండా పొట్ట చేత పట్టుకొని నులుచుకపోతోంది. ఆమె కడుపునొప్పితో బాధపడుతున్నట్లుంది. నే గభ్భున లేచి పరుపుమీదకు తీసుకవచ్చాను.

మాటాడలేకపోతోంది. అప్పటి పరిస్థితి చూశాక నాకే భయంవేసింది. డాక్టరుదగ్గరకు వెళ్లటానికి ఒక్కర్తెను విడిచి వెళ్లట మెలా? ఏం చెయ్యటమో తోచక సుగుణను గట్టిగా పట్టుకున్నాను

'సుగుణా!' అన్నాను అంతే.

'హుం' అంది అలసటతో.

'కడుపులో నొప్పిగా వుందా ?'

'హుం'

'డాక్టరు...' సగంలోనే ఆగిపోయాను.

'అబ్బా...వద్దు...మీ గుండెమీద చారబడితే ఆ నొప్పి అదే పోతుంది' చాలా హీనస్వరంతో అంటూ అలా పొట్ట చేతపట్టుకొని నా వక్షంమీద తల ఆన్చింది, కళ్లు మూసుకొనే వున్నయ్.

ఆమె యీ నమ్మకంమీద నాకు గౌరవం లేదు. డాక్టరుకోసం నా మనసు తహతహలాడిపోతోంది. నొప్పి రానురాను గుండెల్లోనికి వస్తున్నట్లుంది. వంగి నులుచుకొని బాధపడుతోంది. యిరుగుపొరుగువాళ్లనెవరినైనా కేక వేద్దా మనుకున్నాను.

కాని సుగుణ బాధతోకూడిన హీనస్వరంతో అంది—

'న...న్ను...మరచిపోండి...'

నా సుగుణ నెలా మరుస్తాను? యీ నాలుగు రోజుల్లో జన్మజన్మాలకూ మరచిపోకుండా చేసింది. ఇంత హఠాత్తుగా యీనొప్పి రావటానికి కారణం నేనే అనిపించింది. ఆమెను నిద్రపోకుండా చేశాను.

సుగుణ మళ్లా అంది...'మరచిపోండి...శల'

'సుగుణా, నేనూ నీతో వస్తాను.' అని గట్టిగా ఆమెను దగ్గరగా చేర్చుకున్నాను. నా కన్నీటి బొట్లు ఆమెవక్షంపై వ్రాలిపోతున్నయ్.

'మీరు నన్ను గ్రుడ్డిగా ప్రేమిస్తున్నారు' యీ మాటలు రావటంతో...

'లేదు సుగుణా, నే నలా అనుకోలేదు.'

'అయితే! సావిత్రికూడ మీవిషయంలో అలా అనుకోలేదు.'

నాకు బుద్ధి వుందని నే ననుకున్నా ఒక్కసారి వున్నతంగా యెలా పోగలుగుతాను? సుగుణకుశాగ్ర బుద్ధికి జోహారు లర్పించకుండా వుండలేకపోయాను. నయం, యింకెవరితోనో వెళ్లిపోతాననిచెప్పి న న్నేడిపించి చివరికి నవ్వించి నన్నొక శుద్ధపూజ్యంలా తయారుచేయలేదు.

సుగుణ మెల్లగా జారి నా తొడమీద తల ఆన్చింది. సగంమూసిన కళ్లతో చేతులతో పట్టుకున్న చీరకొంగువేపు చూస్తూ అంది...

'పాపం! ప్రేమ గుడ్డిదని సావిత్రికి తెలీదు. అదేమిటో నాకూ కూడా తెలీదు. మనసులోని వికారాన్ని వెలిగ్రక్కి యిదే ప్రేమ అనుకొని అసలు ప్రేమకి అంధత్వం కల్పించకండి. సావిత్రి మిమ్మల్ని మరచిపోలేదు. మీకంటే యెన్నోరెట్లు మంచిమనసు గల మనిషికి శరీరం అప్పచెప్పలేక నాలుగు దెబ్బలు తిని వారంరోజులక్రితమే కన్నవారింటికి వచ్చిందట. అన్ని విషయాలూ అత్తయ్య చెప్పేసరికి మీమీద నాకు అసహ్యం వేసింది. ఇది మీకూ నాకూ సంబంధించిన విషయం కాబట్టి అత్తయ్యగారుండగా మామూలుగానే వున్నాను.

మీ నోటివెంబడి మీ జీవితం విననిది అలా చిరాకుగా వుండటం తప్పని యింతవరకుతీసుకొచ్చాను. పిల్లలు చేసిన తప్పులకు తల్లిదండ్రులు బాధ్యులు కారంటే నేను ఒప్పుకోను. మా నాన్న ఉన్నతంగా యెలా పోవటమో చిన్నప్పటినుంచి నూరిపోశారు. పరీక్షాసమయంలో ఆయన లొంగిపోయినా నేను ధైర్యంగా నిలవగలిగాను.

'సావిత్రిలాంటి స్త్రీ యిద్దర్ని ఒక్కసారిగా ఒకేవిధంగా ప్రేమించలేదు. నేను రేపురంగారాయపురం వెళ్తాను. సావిత్రితో పరిచయం చేసుకొంటాను. నేను వుత్తరం వ్రాశాక మీ రొకసారి రండి. ఆనాడు మీ పాదాలమీద కన్నీళ్లతో మీ అమ్మకోసం యెలా చెయ్యివేసిందో అలా మీరు నాకోసం చెయ్యివేసి 'క్షమించు అమ్మా' అనండి. ఆ అమ్మ అన్న మాటతో ఆమె మీమీద వున్న ప్రేమను మాతృప్రేమగా మార్చి వేయగలుగుతుంది. మిమ్మల్ని బిడ్డగా చూసి ఆదరించ గలుగుతుంది. అప్పుడే ఆ హృదయంలో పెళ్లాడిన భర్తకు చోటీయగలుగుతుం దనుకుంటాను.

సుగుణ మెల్లగా ఆగిఆగి నా హృదయానికి హత్తుకున్నట్లు మాట్లాడుతుంటే సావిత్రిపట్ల నా తొలి ప్రవర్తన యెంత హేయమైందో గుర్తించుకున్నాను. నా దృష్టి కరుణామయ మైంది.

'మంచి చేయమంటే కా దంటానా?' అన్నాను.

సుగుణ యేమీ మాటాడలేదు. ఒక్కసారి కళ్లు బాగా విప్పి నా కళ్లల్లోకి చూసింది. మళ్లీ దృష్టి చీర కొంగుమీదకు పోనిచ్చి సాంతంగా అంది: 'అవును. అందుకే నేను గర్వపడుతుంటాను, నా మొగుణ్ని నే నెంచుకోగలిగా నని.'

